ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 25 మార్చి 2024





భావపురి.. చైతన్య దీపిక

2024 సార్వత్రిక ఎన్నికల సమరం సమీపిస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖారారయ్యారు. ఆయా పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఈ సారి షెడ్యూల్‌కు పోలింగ్‌కు మధ్య వ్యవధి 65 రోజులు వచ్చింది. అంటే సుమారు రెండు నెలలకు పైగా ప్రచారాలు నిర్వహిం చుకునే అవ కాశం అభ్యర్థులకు వచ్చింది. అయితే ప్రచార ఖర్చులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. వచ్చిన అవకాశాన్ని సద్విని యోగం చేసుకునేందుకు అభ్యర్థులు, రాజకీయ పక్షాలు ప్రణాళికలు రూపొం దించుకుంటున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాను గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజించారు. దీంతో ఈ మూడు జిల్లాల పరిధిలో మూడు లోక్‌సభ, 20 అసెంబ్లీ నియోజకవర్గాలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గాల వారీగా చరిత్రను పాఠకులకు అందించే ప్రయత్నమిది...

ప్రతిష్ఠాత్మకంగా 2024 ఎన్నికలు..


టి.కృష్ణప్రసాద్

2024 ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకు న్నాయి. భావపురిపై జెండా ఎగుర వేసేందుకు అటు వైసీపీ. ఇటు టీడీపీ కూటమి నేతలు సమాయత్తమవుతున్నారు. సార్వ త్రిక సమరానికి సంబంధించి టీడీపీ, వైసీపీ ఇప్పటికే అభ్యర్థులపై స్పష్టత ఇచ్చాయి. 2019లో వైసీపీ నుంచి పోటీ చేసి గెలు పొందిన నందిగం సురేష్ రెండో సారి అదృ ష్టాన్ని పరీక్షించుకోనున్నారు. టీడీపీ తర పున ఐపీఎస్‌గా ఉమ్మడి రాష్ట్రంలో సేవలం దించిన టికృష్ణప్రసాద్ బరిలో ఉన్నారు. ఇరు పార్టీల శ్రేణులు ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నాయి.

ఉద్దండుల ఖిల్లాగా బాపట్ల..

బాపట్ల స్థానం నుంచి లోక్‌సభకు ప్రాతినిత్యం వహించిన వారంతా ఉద్దండులే. ఆది నుంచి ఈ స్థానం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ ప్రభ తగ్గి పోయి వైసీపీ బరిలోకి వచ్చింది. బాపట్ల లోక్‌సభ పరిధిలోని కారంచేడు సినీ నిర్మాత రామానాయుడు స్వస్థలం కావడంతో బాపట్ల నుంచి ఎంపీగా గెలుపొందిన ఆయన అభివృద్ధి విషయంలో తనదైన మార్కు చూపారు. ఎంపీ నిధులే కాకుండా సొంత ధనంతో అనేక కార్యక్రమాలను చేశారు. ఎన్టీఆర్ కుమార్తె, భారతీయ జనతా పార్టీ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షురాలైన పురందేశ్వరి ఈ జిల్లా కోడలే. దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో పాటు సతీమణి పురందేశ్వరి కూడా ఇదే స్థానం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలోనే విద్య అభ్యసించిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఇదే స్థానం నుంచి లోక్‌సభలో అడుగుపెట్టారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి సైతం ఇక్కడ నుంచి లోక్‌సభలోకి అడుగుపెట్టారు. కాంగ్రెస్ తరపున గెలుపొందిన పనబాకలక్ష్మి కేంద్ర మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వ ర్తించారు. సలగల బెంజిమెన్, మాల్యాద్రి శ్రీరాం కూడా బాపట్ల అభివృద్ధిలో తమదైన మార్కు చూపెట్టారు. ఉపరాష్ట్రపతిగా అత్యున్నత పదవి అధిరోహించిన వెంకయ్య నాయుడు సైతం బీజేపీ నుంచి 1989లో బాపట్ల లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగి పరాజయం పాలయ్యారు.


మాల్యాద్రి


పనబాక లక్ష్మి


పురందేశ్వరి


రామానాయుడు


ప్రసాద్‌రావు

బాపట్ల ప్రత్యేకతలు ఇవి..

ఐదో శతాబ్దం నాటి భావనారాయణస్వామి ఆలయంతో ఈ ప్రాంతానికి భావపురిగా ఘనత వహించింది. కాలాంతరాన భావపురి బాపట్లగా మారింది. చారిత్రక నేపథ్యం ఉన్న బాపట్ల.. స్వాతంత్ర్య సమరంలో ఎన్నో కీలక ఘట్టాలకు వేదికగా నిలిచింది. దాదాపు 70 కిలో మీటర్ల మేర ఉన్న తీర ప్రాంతం బాపట్ల సొంతం. కార్తీకమాసంలో సూర్యలంక సముద్ర తీరానికి లక్షల సంఖ్యలో భక్తులు స్నానానికి పోటెత్తుతారు. దక్షిణ భారతదేశంలో తొలిగా వ్యవసాయ కళాశాల బాపట్లలో 1945 జూలై 11న మొదలైంది. ఇక్కడే బీపీటీ- 5204 సాంబా మసూరి వరి వంగడాన్ని ప్రముఖ శాస్త్రవేత్త ఎంవీ రెడ్డి ఆవిష్కరించారు. బాపట్ల జీడి మామిడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తయారు చేసిన బీపీపీ-8 వంగడం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇక్కడ వ్యవసాయ విద్యనభ్యసించిన విద్యార్థులు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా వివిధ రంగాల్లో కీర్తి గడించారు. ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీకి అనుబంధంగా జీడిమామిడి పరిశోదనా కేంద్రం, నూతన వంగడాల పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు తన వంతుగా సేవలందించడంలో బాపట్ల విరాజిల్లుతోంది. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీలో భాగమై ఉన్న కళాశాలలు బాపట్లను విద్యల కాణాచిగా మార్చాయి. రాష్ట్రంలో పొడవైన సముద్ర తీరప్రాంతం కలిగిన జిల్లా. ఆక్వా రంగానికి కేంద్రంగా బాపట్ల ఉంది. ఏటా రూ.1200 కోట్ల విలువైన రొయ్యల పిల్లలు, చేపలు ఎగుమతి జరుగుతుంది. బాపట్ల లోక్‌సభ పరిధిలోని చీరాల వస్త్ర పరిశ్రమకు ప్రధాన కేంద్రం. మార్టూరు గ్రానైట్ పరిశ్రమల కేంద్రంగా గుర్తింపు ఉంది.

14,96,873
మొత్తం ఓట్లు

7,66,153
మహిళలు

7,30,642
పురుషులు


78
ఇతరులు

బాపట్ల లోక్‌సభ పూర్వపరాలు..

బాపట్ల లోక్‌సభ స్థానంగా ఏర్పడక ముందు తెనాలి లోక్‌సభ పరిధిలో ఉండేది. లోక్‌సభ స్థానాల పున ర్విభజనలో భాగంగా బాపట్ల లోక్‌సభ స్థానంగా 1977లో ఆవిర్భవించింది. 2004 వరకు జనరల్ స్థానంగా ఉండగా 2009 నుంచి ఎస్సీ రిజర్వ్‌గా మార్చారు. 2009లో చేపట్టిన అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పొన్నూరు స్థానం గుంటూరు లోక్‌సభలోకి వెళ్లగా ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు బాపట్ల లోక్‌సభ పరిధిలో చేరింది. గతంలో ఈ స్థానం ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉండేది. ఉమ్మడి గుంటూరు పరిధిలోని వేమూరు, బాపట్ల, రేపల్లెతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని సంతనూతలపాడు, పర్చూరు, అద్దంకి, చీరాల ఉండేవి. బాపట్ల జిల్లాగా ఆవిర్భవించాక ఒక్క సంతనూతలపాడు మినహాయిస్తే మిగిలిన ఆరుస్థానాలు ఈ జిల్లా పరిధిలోకి వచ్చాయి. జిల్లాగా ఏర్పడ్డాక తొలిసారి బాపట్ల లోక్‌సభకు ఎన్నిక జరగబోతోంది. ప్రస్తుతం బాపట్ల జిల్లాలోని ఆరుస్థానాలతో పాటు ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు బాపట్ల లోక్‌సభ పరిధిలో ఉన్నాయి.

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1977	అంకినీడు ప్రసాద్‌రావు	కాంగ్రెస్	జె. చంద్రమౌళి	బీఎల్‌డీ	42,946
1980	అంకినీడు ప్రసాద్‌రావు	కాంగ్రెస్	పి.సాంబయ్య	జనతా	1,51,741
1984	చిమటా సాంబు	టీడీపీ	ఎం. రాజేశ్వరరావు	కాంగ్రెస్	34,420
1989	సలగల బెంజిమెన్	కాంగ్రెస్	ఎం. వెంకయ్యనాయుడు	బీజేపీ	43,620
1991	దగ్గుబాటి వెంకటేశ్వరరావు	టీడీపీ	సలగల బెంజిమెన్	కాంగ్రెస్	1097
1996	ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు	టీడీపీ	విజయ ప్రసాద్ ఆర్య	కాంగ్రెస్	8,262
1998	నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి	కాంగ్రెస్	ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు	టీడీపీ	40,488
1999	డి. రామానాయుడు	టీడీపీ	జేడీ శీలం	కాంగ్రెస్	92,457
2004	దగ్గుబాటి పురంధేశ్వరి	కాంగ్రెస్	రామానాయుడు	టీడీపీ	94,082
2009	పనబాక లక్ష్మీ	కాంగ్రెస్	మాల్యాద్రి శ్రీరామ్	టీడీపీ	69,338
2014	మాల్యాద్రి శ్రీరాం	టీడీపీ	వరికూటి అమృతపాణి	వైసీపీ	32,754
2019	నందిగం సురేష్	వైసీపీ	మాల్యాద్రి శ్రీరాం	టీడీపీ	16,065


చిమటా సాంబు


బెంజిమెన్


వెంకటేశ్వరరావు


నేదురుమల్లి


ఉమ్మారెడ్డి


సురేష్

- మహామహుల ప్రాతినిథ్యం బాపట్ల సొంతం
- 1977లో లోక్‌సభ స్థానంగా బాపట్ల ఆవిర్భావం
- 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు
- గెలుపోటముల్లో మహిళల ఓట్లే కీలకం

నియోజకవర్గ ముఖచిత్రం



బాపట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చారి త్రక నేపథ్యం.. స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర.. సుందరమైన సముద్రతీరం.. విద్యలకు కాణాచి.. ఉద్యమాల గడ్డ.. ఆధ్యాత్మిక కేంద్రం.. పర్యాటక ప్రాంతం బాపట్ల సొంతం. అనేక ఉద్య మాలకు ఊపిరులూదిన గడ్డగా బాపట్ల చరిత్ర కెక్కింది. భారతీయ వాయుసేన కేంద్రం, దక్షిణ భారతదేశపు తొలి వ్యవసాయ విద్యాలయం, ఐదో శతాబ్దం నాటి భావ నారాయణ స్వామి ఆలయం, భట్టిప్రోలు స్తూపం, సూర్య లంక సముద్రతీరం, చీరాల దగ్గర ఓడరేవు బాపట్ల సొంతం. 1794లోనే బాపట్ల తాలూకా ఏర్పడింది. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న భావనకు బాపట్ల టౌన్ హాలులో 1913 మే 26, 27న నిర్వహించిన ప్రథమాంధ్ర మహాసభలలో బీజంపడింది. స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో 1919లో నిర్వహించిన చీరాల-పేరాల ఉద్యమం జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత సంతరించు కుంది. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న బాపట్ల నుంచి గెలిచి లోక్‌సభలోకి అడుగు పెట్టిన వారిలో మహామహులు ఉన్నారు. 1977లో బాపట్ల లోక్‌సభ నియోజకవర్గంగా ఆవిర్భ వించింది. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వచ్చిన వారంతా ఖ్యాతిని ఆర్జించిన వారే. గత చరి త్ర కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నా ప్రతి పక్షాలనూ ఆదరించిన ఘనత ఈ స్థానం సొంతం. ఇప్పటి వరకు 12 సార్లు ఎన్నికలు జరగ్గా ఆరు సార్లు కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేయగా, ఐదు సార్లు టీడీపీ, ఒకసారి వైసీపీ గెలుపు తీరాలకు చేరాయి. పురుషుల కంటే 36 వేల మంది ఎక్కువగా మహిళా ఓటర్లు ఉన్నారు. దీంతో ఇక్కడ బరిలో నిలిచే అభ్యర్థుల గెలుపు ఓటముల్లో మహిళా ఓటర్లదే కీలకపాత్ర.

జిల్లాగా ఆవిర్భావం.. మౌలిక వసతుల కొరత

2022 ఏప్రిల్ 4న జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా బాపట్ల జిల్లాగా ఆవిర్భవించింది. లోక్‌సభ స్థానాలను జిల్లాలుగా చేయాలనే ప్రభుత్వ పాలసీ ప్రకారం భావపురి జిల్లా కేంద్రమైంది. గుంటూరు జిల్లా నుంచి వేమూరు, రేపల్లె, బాపట్ల, ప్రకాశం జిల్లా నుంచి చీరాల, పర్చూరు, అద్దంకిలతో బాపట్ల నూతన జిల్లాగా ఏర్పాటైంది. జిల్లాలోని ఆరు స్థానాలు బాపట్ల లోక్‌సభ నియోజక వర్గ గొడుగు కిందకు రాగా ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు మాత్రమే బాపట్ల లోక్‌సభ స్థానం పరిధిలో ఉంది. జిల్లాగా ఏర్పడినా బాపట్లలో అనేక మౌలిక వసతులు లేవు. పాలకులు కొం చెం ఊతమిస్తే అటు పర్యాట కంగా.. ఇటు వ్యాపార, విద్య, వాణిజ్య కేంద్రంగా బాపట్ల అభి వృద్ధి చెందుతుంది. బాపట్ల --చీరాల జంట నగరాలుగా బాసిల్లే అవకాశం ఉంది.

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు	
ఎస్సీ(మాల)	-1,97,000
ఎస్సీ(మాదిగ)	-1,49,000
రెడి	-1,20,027
కమ్మ	-1,84,470
కాపు	-1,36,000
ముస్లిం	-80,000
ఎస్టీ	-35,000
యాదవ	-1,17,000
చేనేతలు	-63,000
మత్స్యకార	-35,000
గౌడ	-64,000
వైశ్య	-60,000
ఇతరులు	-2 లక్షలకు పైగా

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(సోమవారం)
సహారీ (ఉదయం) 4.52 (మంగళవారం)



పనులు చేసినా.. పస్తులే!

- రెండు నెలలుగా ఎదురుచూపులు
- అందని ఉపాధి వేతన బిల్లులు
- కూలీ రూ.38.77 కోట్ల బకాయిలు
- మెటీరియల్ బిల్లుల బకాయి రూ.58.93 కోట్లు

ఉపాధి.. ఉత్తిత్తిగా మారింది. కూలీలు పనులు చేస్తున్నారు.. అయితే వారికి వారం కాదు కదా నెలకు కూడా కూలి చెల్లిం చడం లేదు. జనవరి నుంచి ఇప్పటివరకు పనులు చేసిన కూలీ లకు ఉపాధి సొమ్ములు చెల్లించలేదంటే పరిస్థితి అర్థం చేసుకో వచ్చు. వలసలు నివారించడం, వ్యవసాయ కార్మికులు, కూలీలకు పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో లోపాలు చోటు చేసుకుంటున్నాయి. చేసిన పనికి రెండు రోజుల్లో ప్రతి కార్మికునికి కూలీ సొమ్ము వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉంది. ఈ చెల్లింపుల్లో తీవ్రజాప్యం జరుగుతోంది. నెలలు గడుస్తున్నా కష్టపడి చేసిన పని కూలీ సకాలంలో రాక పోతుండటంతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చేసిన పనికి వేతనం అందక ఉపాధి వేతనదారులు రెండు నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు రూ.38.77 కోట్లు బకాయిలు ఉండటంతో కష్టాలు తప్పడంలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేదని కష్టజీవులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాస్ పుస్తకాలు చేతపట్టు కొని బ్యాంకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఖాతాలు ఖాళీగా కనిపించడంతో నిరాశకు లోనవుతున్నారు. పనులకు సంబంధించిన సామాగ్రి బిల్లుల బకాయి రూ.58.93 కోట్లు ఉన్నాయి. ప్రతివారం క్షేత్రస్థాయి సిబ్బంది మండల కార్యాలయానికి వివరాలు పంపిస్తారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రెండు రోజులకు వారి ఖాతాల్లో నగదు జమ చేయాలి. ఇదంతా జరుగుతున్నా రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించట్లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. జనవరి 29నుంచి వేతనాలు అందకపోవడంతో మొత్తం రూ.38.77 కోట్ల బకాయిలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రతి వ్యక్తికి 100రోజుల పని దినాలను కూలీలకు కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది. చేసిన పనికి కూలీ రాకపోతుండటంతో ఈ పనుల పట్ల కార్మికులు ఆసక్తి కనబరచడంలేదు. దీంతో ఉపాధి పథకం లక్ష్యాలు నెరవెరడం లేదు.



యంత్రాంగం అలసత్వం..

ప్రభుత్వం కార్మికుని సగటు వేతనం రూ.272గా నిర్ణయించింది. ఈ మేరకు ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు సగటు వేతనం లభించడంలేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా తమకు సగటు వేతనం అమలు చేయాలని కూలీలు కోరుతున్నారు. ఈ దిశగా ఉపాధి యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉంది. వ్యక్తిగత పని దినాలు కల్పించడంలో కొంత యంత్రాంగం అలసత్వంగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పల్నాడు జిల్లాలో అత్యధికంగా జాబ్ కార్డులు నమోదు చేశారు. ఈ జిల్లాలో 5.37 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేయబడ్డాయి. అలాగే గుంటూరు జిల్లాలో 2.03 లక్షలు, బాపట్ల జిల్లాలో 4.52 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. నమోదు చేసుకున్నవారందరూ పనులు హాజరు కావడంలేదు. పల్నాడులో 4.36 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. బాపట్లలో 3.68 లక్షలు, గుంటూరులో 1.48 లక్షల కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీరు మాత్రమే ఉపాధి పనులకు హాజరౌతున్నారు. పేరు నమోదు చేసుకోని పనులకు హాజరు కాని కార్మికుల సంఖ్యలో లక్షల్లో ఉండటం గమనార్హం. వీరికి కూడా ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఉపాధి పనుల్లో కార్మికుల పనిదినాలను ముందుగానే అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పని దినాలు కల్పించడంలో అధికారులు విఫమవుతున్నట్టు లెక్కలు తెలియజేస్తున్నాయి. చేసిన పనికి రెండు నెలలుగా ఒక్క రూపాయి కూడా కూలీ చెల్లించకపోవడంతో వారు తీవ్ర అందోళన చెందుతున్నారు. కోట్లల్లో కార్మికుల వేతన బకాయిలు ఉన్నాయి. చేసిన కష్టానికి వేతనం చెల్లింపులో ఆలస్యం అవుతుండటం పట్ల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీ చెల్లించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

వేసవి భత్యాలు రద్దు

గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20 శాతం. మార్చిలో 25 ఏప్రిల్లో 30 శాతం అదనపు వేతనం ఇచ్చేవారు. మజ్జిగ కూడా సరఫరా చేసేవారు. తాగునీటికి రూ.5, గునపానికి రూ.10, తట్టకి రూ.13 చెల్లించేవారు. ప్రస్తుతం వీటినీ రద్దు చేశారు. దీంతో వేతనదారులపై ఆర్థికభారం పడుతోంది.

మెటీరియల్ బిల్లుల బకాయి రూ.58.93 కోట్లు

కార్మికుల వేతనాలతో పాటు చేసిన పనుల మెటీరియల్ బిల్లులు నిలిచిపోయాయని బాధితులు చెబుతున్నారు. మూడు జిల్లాల్లో రూ 58.93 కోట్ల బకాయి ఉన్నట్టు సదరు శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. గుంటూరు జిల్లాల్లో రూ.16.39 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.22.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.20.05 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెటీరియల్ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూడేళ్లైనా.. ముళ్లపొదలే

- చిట్టడవిలా జగనన్న కాలనీలు
- పునాదులకు నోచుకోని పేదల ఇళ్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా లేఅవుట్లు

పిడుగురాళ్ల, మార్చి 24: పేదల కోసం.. వారి సొంతింటి కల నెరవేర్చేందుకు ఊరూరా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు ముళ్ల పొదలతో చిట్టడవులను తలపిస్తున్నాయి. మూడేళ్లుగా ఒక్క ఇల్లు కూడా పునాదులకు నోచుకోలేదు. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి మూడేళ్లు అవుతున్నా ఒక్కరంటే ఒక్కరికి కూడా సొంతింటి కల నెరవేరలేదు. దాచేపల్లి, గురజాల, పిడుగురాళ్ల, మాచవరం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో మూడేళ్ల క్రితం ఆర్భాటంగా జగనన్న కాలనీల పేరుతో సెంటున్నర చొప్పున పట్టాలు పంపిణీ చేశారు. పిడుగురాళ్ల రూరల్‌లో 2,550, మాచవరంలో 1500, గురజాల రూరల్‌లో 2268, దాచేపల్లి రూరల్‌లో 2440 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అయితే వీరిలో అర్హులైన పేదలకంటే వైసీపీ అనుయా యులు, నేతల అనుచరులకే అగ్రతాంబూలం ఇచ్చినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఊరికి దూరంగా కాలనీలు ఏర్పాటు చేసి పట్టాలు పంపిణీ చేశారు. జగనన్న కాలనీల కోసం సేకరించిన భూముల నుంచి అధికార పార్టీ నేతలు దండిగానే జేబులు నింపుకున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. అయితే ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. కాలనీల్లో ఇల్లు నిర్మించుకుంటామని అక్కడక్కడ కొందరు లబ్ధిదారులు ముందుకొచ్చినా ప్రభుత్వం నిధులు మంజూ రు చేయలేదు. ఊరికి దూరంగా ఉన్న కాలనీలకు వెళ్లి సొంత ఖర్చుతో ఇల్లు కట్టుకునేందుకు లబ్ధిదారులు వెనుకంజ వేశారు. లోలెవల్, గుంతలుగా ఉన్న లేఅవుట్లలో స్థలం చదునకే రూ.లక్షలు వెచ్చించాల్సి రావడంతో ఇంటి నిర్మాణాలపై లబ్ధిదారులు ముందుకు రాలేదు. టీడీపీ హయాంలో సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్న వారికి రూ.2.5 లక్షల సాయం అందించగా వైసీపీ ప్రభుత్వం పట్టాలతో సరిపెట్టి రూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో పట్టాలు అందుకున్న లబ్ధిదారులు కూడా ఇంటి నిర్మాణాలకు మొగ్గుచూపలేదు. కొన్ని చోట్ల మందు బాబులకు, మరికొన్ని చోట్ల అ సాంఘిక కార్యక లాపాలకు జగనన్న కాలనీ లే అవుట్లు అడ్డాగా మారాయి.


గంగవరం జగనన్న కాలనీలో చిట్టడిలా పెరిగిన ముళ్ల చెట్లు


పిల్లుట్ల జగనన్న కాలనీలో పెరిగిన ముళ్ల పొదలు



మంగళగిరి 23వ వార్డులో ఆదివారం రాత్రి నిర్వహించిన రచ్చబండలో ప్రసంగిస్తున్న లోకేశ్

ప్రజల హృదయాలను గెలుస్తా

- బ్లాక్ డెవలప్‌మెంట్ మోడల్‌లో మంగళగిరి అభివృద్ధి
- బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్, రచ్చబండ కార్యక్రమాల్లో యువనేత



వైసీపీ నేతల మోసానికి ఆత్మహత్య చేసుకున్న పాల సుబ్బారావు కుటుంబీకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న లోకేశ్

మంగళగిరి, మార్చి 24: గత ఎన్నికల్లో తాను ఓటమి చెందినా మంగళగిరి ప్రజల హృదయాలను గెలుచుకోవాలనే పట్టుదలతోనే నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని సేవలు అందిస్తున్నట్లు టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం తాడేపల్లి వజ్ర రెసిడెన్సీవాసులను బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్ కార్యక్రమంలో కలుసుకున్నారు. పాత 23వ వార్డు అంబేడ్కర్ సెంటర్, తాడేపల్లి నులకపేట, క్వారీ ప్రాంతాల్లో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ రాబోయే ఇరవై ఏళ్లకు సరిపడా మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా మంగళగిరి అభివృద్ధికి ప్రణాళికతో తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బ్లాక్ డెవలప్‌మెంట్ మోడల్ కింద అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడతామన్నారు. ఎన్నికలకు స్థానికంగా అవాంతరాలను సృష్టించడం ద్వారా పోలింగ్ ప్రక్రియను కొంత జాప్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పెంచిన పన్నుల భారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 30వేలమందికిపైగా స్వర్ణకారుల కోసం ప్రత్యేక సెజ్, చేనేత, ఆటోనగర్ అభివృద్ధి చేస్తామన్నారు.

అరాచకాలకు అడ్డాగా ఏపీ

వైసీపీ హయాంలో గంజాయి, డ్రగ్స్‌కు రాష్ట్రం కేరాఫ్ అడ్రస్‌గా మారిందని లోకేశ్ తెలిపారు. వేల కుటుంబాల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ఈ దందాకు రాగల వందరోజుల్లో చెక్ పెట్టేస్తామన్నారు. జగన్ నివాసానికి చేరువలోనే గంజాయి మత్తులో ఓ వ్యక్తిని హత్యచేసినా పట్టించుకున్నవారే లేరన్నారు. ఈ పరిస్థితులను సమూలంగా మార్చేసి రాష్ట్రంలో శాంతిభద్రతలను తిరిగి గాడిలో పెడతామని చెప్పారు.

ప్రజాభిమానం కొద్దే రాజకీయాల్లోకి:

కేవలం డబ్బుకోసమే అయితే తనకు రాజకీయాల్లోకి రావల్సిన అవసరం లేదని లోకేశ్ చెప్పారు. తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదివి వరల్డ్‌బ్యాంకులో ఉద్యోగం చేశానన్నారు. హెరిటేజ్ ఈడీగా పనిచేసిన రోజుల్లో రూ.కోట్లుగా ఉన్న టర్నోవర్‌ను రూ.1500 కోట్లకు పెంచగలిగానన్నారు. అనునిత్యం రాష్ట్రం కోసం తపనపడే చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలు మోపి 53 రోజులపాటు జైలుకు పంపినపుడు ఈ రాజకీయాలు మనకు అవసరమా? అని తన భార్య బ్రాహ్మణి తనను అడిగిందన్నారు. అదే సమయంలో చంద్రబాబు అరెస్టు దరిమిలా ప్రపంచవ్యాపితంగా వచ్చిన స్పందన చూశాక ప్రజలు మావెంటే ఉన్నారని తమకు స్పష్టంగా అర్థమైందన్నారు.

అణగారిన వర్గాల ఉసురు పోసుకున్న జగన్

రచ్చబండ కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో ఎక్కువగా నష్టపోయింది, వేధింపులకు గురైందీ దళితులు, బీసీలు, మైనారిటీలేనన్నారు. జగన్ పాలనలో ఎస్సీ, బీసీ, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. కడప జిల్లాలో చేనేత కుటుంబం ఆత్మహత్యకు పాల్పడడానికి వైసీపీ నేతలే కారణమన్నారు. దళిత డ్రైవర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును జగన్‌రెడ్డి తనపక్కనే కూర్చోబెట్టుకుని సమీక్షలు చేస్తూ ప్రజలకు ఏమి సంకేతాలను ఇస్తున్నారని ప్రశ్నించారు. తాను గత ఎన్నికల్లో ఓటమి చెందినా ఇక్కడే ఉంటూ నియోజకవర్గ ప్రజలకోసం 29రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలుచేశానన్నారు. రెండుసార్లు గెలిచిన ఆళ్ల తాడేపల్లిలో జగన్ నివాసం వద్ద పేదవాళ్ల ఉండరాదంటూ వారి ఇళ్లను కూల్చివేయించారన్నారు. ఎన్నికల నిబంధనల పేరుతో పోలీసులు తనను లక్ష్యంగా చేసుకుని ఇబ్బందులు పెడుతున్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ముఖ్యమంత్రి జగన్ వాహనాలను తనిఖీలు చేసి ఉంటే పోలీసులకు గంజాయైనా దొరికుండేదన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ రాక్షసపాలన కారణంగానే మంగళగిరి ప్రాంతం నాశనమైపోయిందన్నారు. వైసీపీ నేతల మోసం కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన రాజంపేట కొత్త మాధవరానికి చెందిన పాల సుబ్బారావు, పద్మావతి, వారి కుమార్తె వినయలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేతలు నందం అబద్దయ్య, దామర్ల రాజు, మన్నెం రమేష్‌బాబు, తోట పార్థసారధి, జగ్గారపు రాము, మద్దిరాల రమేష్, జనసేన నేతలు మునగపాటి వెంకట మారుతీరావు, జంజనం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

పార్టీలో చేరిన వారికి న్యాయం చేస్తాం

సత్తెనపల్లి, మార్చి24: వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చేవారికి న్యాయం చేస్తామని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రైవేటు హోటల్లో ఆదివారం రాజుపాలెం మాజీ జడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, సీనియర్ న్యాయవాది మర్రి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కన్నా మాట్లాడుతూ పెన్నా గోదావరి నదుల అనుసధానం పనులను ఈ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. దీనివలన ఎంతో ప్రజాధనం దుర్వినియోగం అయిందన్నారు. స్థానిక మంత్రి రైతుల గురించి ఎప్పుడు పట్టించుకోలేదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ పార్టీలోకి వచ్చే కొత్తవారిని స్వాగతించి పార్టీ పరంగా న్యాయం చేస్తామన్నారు. వైసీపీని వీడి తమకు మద్దతు తెలిపిన మర్రి వెంకట్రామిరెడ్డి, సుబ్బారెడ్డి, మదమంచి రాంబాబు, కుశెలరావు, తదితరులను కన్నా, లావు కృష్ణదేవరాయులు అభినందించారు. కార్యక్రమంలో మర్రి వెంకట్రామిరెడ్డి, సుబ్బారెడ్డిలు కన్నా, లావులను పూలమాలలతో సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో తమందరం ఐక్యంగా కన్నా, లావుల విజయానికి కృషి చేస్తామని వైసీపీని వీడిన నేతలు తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో అంబటి వలన పడ్డ ఇబ్బందులను వెంకట్రామిరెడ్డి, రాంబాబులు వివరించారు. సత్తెనపల్లి నియోజవర్గంలో కన్నా, పార్లమెంటు ఎంపీ లావుల విజయానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎం.బార్ధనందరెడ్డి, నాయకులు పల్లపాటి పెద్దిరాజు, ఆళ్ల అమరేశ్వరరావు, పూజల వెంకటకోటయ్య, కొమటమనేని శ్రీనివాసరావు, శనగపూల నరసింహరావు, అనుమోలు జయరావు, నర్రా బాబురావు, అలా సుబ్బారెడ్డి, నాగుల్‌మీరా, సయ్యద్ మాబు, బొక్క సంగీతరావు, జి.ప్రభాకర్, గుత్తా వెంకట్రావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి హేయం

- మాజీ మంత్రి ఆనందబాబు



వైసీపీ ఎంపీటీసీ దాడి చేసిన టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

కొల్లూరు, మార్చి 24: వైసీపీ జెండాలు తొలగించలేదని ప్రశ్నించిన తమ కార్యకర్తపై వైసీపీ మూకలు దాడి చేయడం హేయమైన చర్యని మాజీ మంత్రి, వేమూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనంద బాబు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కిష్కిందపాలెంలో శనివారం గ్రామ వైసీపీ ఎంపీటీసీ తదితరులు దాడి చేసి గాయపరిచిన తమ కార్యకర్త కొల్లి వెంకటేశ్వరరావును మాజీ మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియామవళిలో భాగంగా అధికారులు అన్ని రాజకీయ పార్టీల జెండాలను తొలగించాల్సి ఉండగా, కేవలం టీడీపీ జెండాలనే తొలగించడంతో తమ కార్యకర్త వైసీపీ జెండాలు ఎందుకు తొలగించలేదని ప్రశ్నించడంతో వైసీపీ ఎంపీటీసీ, సర్పంచ్, కార్యకర్తలు తమ కార్యకర్తపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడం వారి రౌడీయిజానికి నిదర్శనమన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు అధైర్యపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆపై తాము చూసుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్‌పోస్టుల్లో సీటీ శాఖ జేసీ తనిఖీలు

పొందుగల చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న జేసీ నాగజ్యోతి

గుంటూరు, మార్చి 24: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను వాణిజ్యపన్నుల శాఖ గుంటూరు-2 జాయింట్ కమిషనర్ నాగజ్యోతి ఆదివారం తనిఖీలు చేశారు. పొందుగల, సత్రశాల, విజయపురిసౌత్‌ల వద్ద ఉన్న తనిఖీ కేంద్రాలను ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించారు. కోడ్ అమల్లో ఉన్న సందర్భంగా రాష్ట్రంలోకి అనధికారికంగా వచ్చే వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. వే బిల్లులు, ఇన్‌వాయిస్ బిల్లులను పక్కాగా తనిఖీలు చేయాలన్నారు. తనిఖీల్లో ఎక్కడా నిర్లక్ష్యం వద్దని, ఎక్కడైనా అనుమానాలుంటే వెంటనే వాహన లోడ్‌ను పూర్తిస్థాయిలో తనిఖీలు చేయాలని ఆదేశించారు.

రాజధాని కోసం 33వేల ఎకరాల భూములిచ్చాం

- 1559వ రోజుకు రైతుల ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలోని మహిళలు

తుళ్లూరు, మార్చి 24: రాష్ట్ర రాజధాని నిర్మాణ కోసం 33వేల ఎకరాల భూములిచ్చామని, అందుకు ప్రతి ఫలంగా సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులంటూ అమరావతిని నిర్వీర్యం చేసి గొప్పపని చేశాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1559వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడారు. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ఉంటుందని స్పష్టంచేశారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా అమరావతిని అంగుళం కూడా కదపలేరన్నారు. రాజధాని కోసం తాము భూములిస్తే.. వైసీపీ నేతలు రాష్ట్రంలో వేల ఎకరాలు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర రాజధాని అమరావతిని అభివృద్ది చేయమంటే చలనం లేదన్నారు. హైకోర్టు తీర్పును కూడా ఉల్లంగించారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లో రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతిని కొనసాగించాలని రైతులు ఆందోళనలు వ్యక్తం చేశారు.

కాపులకు అండగా ఉంటా

- ఆత్మీయ సమావేశంలో యరపతినేని



మాట్లాడుతున్న గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 24: తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో కాపు సామాజికవర్గ నేతలు ఎందరో తనకు అండగా వున్నారని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక కల్యాణ మండపంలో కాపు సామాజికవర్గ నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ హయాంలో ఆటోనగర్ స్థలాల్లో కాపు సామాజికవర్గానికి చెందిన కొందరికి కేటాయించిన ప్లాట్లను వైసీపీ పాలనలో రద్దు చేయడంతో పాటు అనేక ఇబ్బందులు పడిన విషయాన్ని పలువురు కాపు సామాజికవర్గ నేతలు యరపతినేని దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రాన్ని సైకో పాలన నుంచి రక్షించేందుకు చంద్రబాబుకు తోడుగా వున్న పవన్‌కల్యాణ్‌ను రాష్ట్ర ప్రజలు అభినందిస్తున్నారని యరపతినేని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాపు రిజర్వేషన్, కాపు భవన్ నిర్మించిన విషయాన్ని గుర్తుచేస్తూ పదవుల కేటాయింపులోనూ తగిన ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో కాపులకు జరిగిన అన్యాయాన్ని వివరించడంతో పాటు దాచేపల్లి మండలంలో తనకు ఎంతో అండగా వున్న పురంశెట్టి అంకులును కూడా వైసీపీ నేతలు పొట్టన పెట్టుకున్న విషయాన్ని గుర్తుచేశారు. రేపటి ఎన్నికల తరువాత ఏర్పడే ప్రజాప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికలలో వార్డు సభ్యులు, సర్పంచ్, కౌన్సిలర్ల పదవులన్నింటా కాపులకు తగిన ప్రాధాన్యం ఇస్తానని భరోసా ఇచ్చారు. పిడుగురాళ్లలో కాపు సామాజికవర్గానికి చెందిన శ్మశాన స్థలం కేటాయింపు, ఆటోనగర్‌లో రద్దు చేసిన ప్లాట్లను తిరిగి కేటాయించడంతో పాటు యూత్‌పాలసీ కింద యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు ఆర్థిక భరోసా, సామాజిక అభివృద్ధికి తానెప్పుడూ అండగా వుంటున్న విషయాన్ని వివరించారు. ఈ సందర్భంగా యరపతినేనిని పలువురు కాపు సంఘీయులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో దేశినేని మోహన్‌రావు, గోపిదేశి సాంబశివరావు, మల్లెంశెట్టి లక్ష్మణరావు, బశ్వల చంద్రశేఖర్, ఆముదాల గంగయ్య, దేశినేని రాంబాబు, కామిశెట్టి రమేష్, రోళ్ల కోటేశ్వరరావు, దామిశెట్టి నాగేశ్వరరావు, రామిశెట్టి చంద్రశేఖర్, కామిశెట్టి అమరలింగేశ్వరరావు, గుర్రం రామకోటేశ్వరరావు, లేళ్ల ప్రసాద్, కొమిరిశెట్టి రామచంద్రయ్య, మెండు బాలసుబ్రహ్మణ్యం, బేతంచర్ల కోటిమేస్త్రి, ఆముదాల చినగంగయ్య, కొమ్మా మహేష్, నెకరికంటి శివ, నూతి సూరి, రమాదేవి, మునగా వెంకట్, మణికంఠ రాము, రామిశెట్టి మధు, తదితరులు పాల్గొన్నారు.

యార్డులో అసోసియేషన్ల కార్యాలయాలు మూసివేత



మిర్చియార్డు ఆవరణలో కార్మిక సంఘాల కార్యాలయాలకు సీలు వేయిస్తున్న మార్కెట్ కమిటీ అధికారులు

గుంటూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో వైసీపీ నేతలతో సమావేశాలు ఏర్పాటు చేసినందుకు వివిధ కార్మిక, వ్యాపారుల సంఘాల కార్యాలయాన్నింటికి సీలు వేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతి సంచికలో వైసీపీతో... వేమెన్‌లు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు స్పందించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి వైసీపీ నేతలతో వేమెన్‌ల సంఘం సమావేశం నిర్వహించినందుకు నోటీసులు జారీ చేయించారు. అలానే యార్డు ఆవరణలో ఉన్న వేమెన్ అసోసియేషన్లు, హమాలీ, దొడ్డికావలా, గుమాస్తాలు, మిర్చి ఎక్స్‌పోర్టర్స్ తదితర సంఘాల కార్యాలయాన్నింటికీ యార్డు సెక్రెటరీలను పంపించి తాళం వేయించారు. ఎన్నికల కోడ్ ముగిసేవరకు వాటిని తెరవరాదని ఆదేశించారు. అలానే ఎవరైతే వేమెన్‌లు వైసీపీ నేతలతో సమావేశం పెట్టారో వారికి నోటీసులు జారీచేయాలని నిర్ణయించారు. నోటీసులకు ఇచ్చే సమాధానాల ఆధారంగా చర్యలు తీసుకొంటామని జేడీ తెలిపారు.

యార్డులో రాజకీయ సమావేశాలకు తావు లేదు: మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డులో ఎలాంటి రాజకీయ సమావేశాలకు తావులేదని మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మిర్చియార్డు అనేది ప్రభుత్వసంస్థ అని, యార్డు ప్రాంగణంలోని కమీషన్ దుకాణాల్లో రాజకీయ నాయకులు ఫోటోలు, ఫ్లెక్సీలు, పార్టీల జెండాలు ఏర్పాటుచేయరాదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులౌతారని హెచ్చరించారు.

జగన్ భూదాహానికి ప్రజలు బలి

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 24: రాష్ట్రంలో జగన్ భూదాహానికి అమాయక ప్రజలు బలై పోతున్నారని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తం చేశారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో ఒకే కుటుంబానికి ముగ్గురి ఆత్మహత్యలే ఇందుకు నిదర్శనం అన్నారు. ఈ హత్యలను జగన్ ప్రభుత్వం హత్యలు గానే భావించాలన్నారు. అధికార పార్టీ భూ కబ్జాల కోసం రెవెన్యూ రికార్డులను తారుమారు చేస్తూ బడుగుల జీవితాలతో చెలగాట మాడుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆస్తులు ఎలా అన్యాక్రాంతం అవుతున్నాయో చెప్పే దానికి ఇదో ఉదాహరణ అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల నుంచి ఇదే పనిలో ఉన్నారని, ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చి వేల ఎకరాల పేదల భూములు కొట్టేస్తున్నారని తాము మొదటి నుంచి చెపుతూనే ఉన్నామని గుర్తు చేశారు. ఇటీవల తెచ్చుకున్న ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా ఆ కుయుక్తులకు మరింత పదును పెట్టారన్నారు. ఈ చట్టంతో ప్రజల ఆస్థి హక్కులకు విఘాతం కలిగేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనానికి ముఖ్యంగా పేదలు, ఆర్థికంగా బలహీన వర్గాల వారికి విదరుద్ధంగా ఉన్న ఈ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రత్తిపాటి డిమాండ్ చేశారు.

తనిఖీల్లో రూ.2.79 లక్షలు స్వాధీనం

తాడికొండ, మార్చి 24: తాడికొండ అడ్డరోడ్డు చెక్ పోస్టు వద్ద ఆదివారం ఓ కారును తనిఖీలు చేయగా రూ.2,79,290 గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గుంటూరుకు చెందిన ఆంద్ర శ్రీనివాసరావు కారులో గుంటూరు నుంచి పెదకూరపాడు మండలం గారపాడు వెళ్తున్నాడు. తుళ్లూరు ఎస్.ఐ వేణుగోపాల్ తన సిబ్బందితో కారును తనిఖీలు చేశారు. స్వాధీనం చేసుకున్న నగదును ట్రెజరీకి పంపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

జేఎంజే వద్ద పోలీసుల సోదాలు.. రూ.లక్ష స్వాధీనం

తెనాలి, మారీసుపేట మార్చి 24: పట్టణంలో జేఎంజే కళాశాల వద్ద ఆదివారం వానాలను తనిఖీలు నిర్వహిస్తుండగా గుంటూరు నుంచి తెనాలి వస్తున్న ఒక కారులో ఎటువంటి రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అందజేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి



మహాలక్ష్మమ్మ మృతదేహం

దాచేపల్లి, మార్చి24: వేగంగా ప్రయాణిస్తున్న లారీ రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం దాచేపల్లిలోని కారంపూడి బస్టాండ్ వద్ద జరిగింది. మృతురాలు కారంపూడి మండలం బట్టువారిపల్లె గ్రామానికి చెందిన సరికొండ మహాలక్ష్మమ్మ(57)గా గుర్తించారు. మృతురాలు మహాలక్ష్మమ్మ మిర్యాలగూడలో తన కొడుకు వద్దకు వెళ్లి తిరిగి స్వగ్రామమైన భట్టువారిపల్లె వెళ్లేందుకు బస్సులో మిర్యాలగూడ నుంచి దాచేపల్లి చేరుకుంది. బస్సును ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ వేగంగా వచ్చి మహాలక్ష్మమ్మను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. దాచేపల్లి ఎస్ఐ సంధ్యారాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

మాచర్లరూరల్, మార్చి 24: బైకు అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని 24వ వార్డుకు చెందిన షేక్ యాసిన్(30) ద్విచక్ర వాహనంపై తన స్నేహితునితో కలిసి మండాది నుంచి వస్తున్నారు. పట్టణ శివారులోకి రాగానే బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో యాసిన్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యాసిన్ మృతదేహం

ఆటో బోల్తా...విద్యార్థి మృతి

నాదెండ్ల, మార్చి 24: అదుపు తప్పిన ఆటో కాలువలోకి దూసుకువెళ్ళటంతో ఇర్లపాడు గ్రామానికి చెందిన ఏటీ రాకేష్ (15) అనే విద్యార్థి మృతి చెందగా మరో ఇద్దరు గాయ పడ్డారు. ఈ సంఘటన ఎండుగుంపాలెం, నాదెండ్ల గ్రామాల మధ్య ఆదివారం జరిగింది. ఎస్ఐ బాల రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో జరిగే వివాహంలో చిరిబోయిన రాకేష్ సౌండ్ సిస్టమ్, విద్యుత్ అలంకరణ తదితరాలను ఏర్పాటు చేస్తున్నాడు. ఈ క్రమంలో నాదెండ్లలో డీజే సౌండ్ సిస్టమ్‌ను తీసుకు వచ్చేందుకు ఇర్లపాడు నుంచి ట్రక్ ఆటోలో గ్రామానికి చెందిన టీ కల్యాణ కుమార్, రాకేష్ బయలుదేరారు. ఎండుగుంపాలెం-నాదెండ్ల గ్రామాల మధ్య ఆటో అదుపుతప్పి కాలువలోకి దూసుకు వెళ్లింది. ఈ ఘటనలో ఏటీ రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన రాకేష్ ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నాడు. ప్రమాదంలో కళ్యాణ్ కుమార్‌తో పాటు సిరిబోయిన రాకేష్ కూడా గాయపడ్డాడు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన విద్యార్థి రాకేష్

ప్రభుత్వ మద్యం దుకాణంలో రూ.7లక్షలు స్వాహా

రేపల్లె, మార్చి 24: ప్రభుత్వం మద్యం దుకాణాల్లో గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయాల్లో రూ.7లక్షలు సేల్స్‌మ్యాన్లు, సూపర్‌వైజర్లు దోచేసుకున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళటంతో ఆదివారం నగరం ప్రభుత్వం మద్యం దుకాణంలో ఏపీ బీసీఎల్ తెనాలి ఐఎన్‌ఎల్ డిపో ఎస్ఐ దివాకర్ విచారణ చేశారు. సుమారు రూ.7లక్షలకు పైనే సూపర్‌వైజర్ మహేష్, సేల్స్‌మ్యాన్ కోటిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డిలను విచారించారు. విషయాన్ని బయటకు పొక్కనివ్వకుండా స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులపై తీవ్రఒత్తిడి తీసుకువచ్చారు. సూపర్‌వైజరు, ముగ్గురు సేల్స్‌మ్యాన్‌లను కాపాడేందుకు అధికార పార్టీ నాయకులు విశ్వప్రయత్నం చేశారు. ఎన్నికల కోడ్ ఉండటంతో అధికారులు ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళిందని మేము ఏమీ చెయ్యలేమంటూ అధికారులు తెలుపుతున్నారని స్థానిక నాయకులే బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఎస్ఐ దివాకర్‌ను వివరణ కోరగా అవకతవకలు జరిగిన మాట వాస్తవమేనని వీరి నలుగురిని బాపట్ల ఐఎంఎల్ డిప్యూటీ మేనేజర్ అరుణకుమారి వద్దకు తీసుకుని వెళ్ళామని తెలిపారు. వీరి వద్ద నుంచి అవకతవకలు జరిగిన నగదును రికవరీ చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న కన్నా, లావు; ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు

సోదరభావమే ఇస్లాం అభిమతం

- కన్నా లక్ష్మీనారాయణ, లావు శ్రీ కృష్ణ దేవరాయలు
- ముస్లింలతో కలసి ఇఫ్తార్ విందు.. ప్రత్యేక ప్రార్థనలు

సత్తెనపల్లి, మార్చి 24 : ప్రతి ఒక్కరిని సోదరభావంతో కలుపుకు పోవటమే ఇస్లాం అభిమతమని కూటమి సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ మానవత్వాన్ని చాటుతూ పేద,గొప్ప తారతమ్యం చూడకుండా ప్రతి ఒక్కరిని సమానదృష్టితో చూడాలన్న మహమ్మద్ ప్రవక్త మార్గాన్ని అనుసరిస్తున్న ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇఫ్తార్ విందును స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో మన్నెం శివనాగమల్లేశ్వరరావు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ముస్లిం నాయకులు, కార్యకర్తలతో పాటు శాసన మండలి మాజీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



యరపతినేని సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న దాచేపల్లి వైసీపీ కార్యకర్తలు

వైసీపీని వీడి టీడీపీలోకి చేరికలు

- పసుపు కుండువాలు కప్పి ఆహ్వానించిన యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి 24: టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనిగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పిడుగురాళ్లకు చెందిన 30 ముస్లిం కుటుంబాల వారు గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. షేక్ మహ్మద్ ఖాశిం, షేక్ సుభాని, సయ్యద్ సైదావలి, అబ్దుల్ కలాం, తాజుద్దీన్, షేక్ అమీర్, పఠాన్ మదీనాఖాన్, షేక్ హర్షద్, అబ్దుల్, సయ్యద్ మౌలాలి, షేక్ బాషిత్, మునీర్‌భాష షేక్ జాన్‌సైదా, నాగుల్‌మీరా, మస్తాన్, బాజి, సుభాని, హసన్ అహ్మద్, ఏసి ఖాశిం, అబ్దుల్లా, రహంతుల్లా, అమన్, పెయింటర్ బాజి, సయ్యద్ సైదా, హనుమంతునాయక్, మరికొందరికి యరపతినేని టీడీపీ కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో షేక్ బాబావలి, పాండురంగ శ్రీను, వడ్లవల్లి సాంబశివరావు, కోట హరి, ఫరీద్‌మేస్త్రీ, ఎల్‌వీఆర్, ఖాశింసైదా, షేక్ సలీం, పిల్లి చెన్నారావు, షేక్ ఖాశింసైదా, సైదా, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి: దాచేపల్లిలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలవారు పిడుగురాళ్లలోని టీడీపీ కార్యాలయంలో యరపతినేని సమక్షంలో టీడీపీలో చేరారు. అంబటి శ్రీను, బొంబోతుల వెంకటేశ్వర్లు, జంగాల శ్రీనివాసరావు, దొడ్డా కోటేశ్వరరావు, జంగాల నాగేశ్వరరావు, సంకురాత్రి కోటయ్య, బొంబోతుల కోటయ్య, సంకురాత్రి రమేష్, ఎలకా హనుమయ్య, జంగాల స్వామి, మెట్ల పుల్లయ్య, జంగాల వెంకటేశ్వర్లు, కుమ్మరి కోటేశ్వరరావు, బాబూరి సైదారావు, యడ్ల నాగరాజు, తదితరులున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బెల్లంకొండ భద్రి, కౌన్సిలర్ నాగరాజు, గండికోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబం ఆత్మహత్యకు కారకులైన

అధికారులను సస్పెండ్ చేయాలి

పెదకూరపాడు/దాచేపల్లి మార్చి 24 : చేనేత కార్మికుడు సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు కారణమైన రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండలంలోని లగడపాడులో వారు నిరసన వ్యక్తంచేశారు. వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో పద్మశాలి కుటుంబం ఆత్మహత్య చేసుకున్న ఘటనలో కుటుంబ సభ్యులకు న్యాయంజరగాలన్నారు. కార్యక్రమంలో చేనేతసంఘం గౌరవ సలహా దారులు అనుముల వెంకటరావు, బండారు వెంకటేశ్వర్లు, అనుముల రామా రావు, బ్రహ్మయ్య, రాములు, తిరుపతిరావులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట మండలంలోని కొత్తమాధవరం గ్రామానికి చెందిన కొత్త సుబ్బారావు అతని భార్య పద్మావతి, కుమార్తె వినయ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని దాచేపల్లి బీసీ సంఘం నేత ముశ్యం శ్రీనివాసరావు అన్నారు. దాచేపల్లి టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన సుబ్బారావుకు సంబంధించిన 3ఎకరాల పొలాన్ని వైసీపీ నాయకులు ఆక్రమించడంతో పాటు బెదిరింపులకు పాల్పడటం, వేధించడం, అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించు కోకపోవడం దారుణమైన విషయమన్నారు. సుబ్బారావు పెద్దకుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, వారి పొలాలను వారికి ఇప్పించాలని ముశ్యం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.



బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

ఉమ్మడి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిని గెలిపించాలి

మాచర్లటౌన్, మార్చి 24: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఆయా పార్టీల నేతలు అన్నారు. ఆదివారం పట్టణంలోని 24వ వార్డులో వారు బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఉమ్మడి ప్రభుత్వంలో అందించనున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే టీడీపీ సూపర్ 6 పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. జూలకంటి బ్రహ్మారెడ్డిని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, యెనుముల కేశవరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వజ్రం నాయక్, కంభంపాటి అనిల్‌కుమార్, కోమటి వీరేశ్వరరావు, పెరుమాళ్ల పుల్లయ్య, మాదినేని శాంతి, బండారు కృష్ణవేణి, లాల్‌కృష్ణ, గబ్బూరి లక్ష్మణ్, ఫారక్, లింగం, నిమ్మల శ్రీను, బొమ్మనబోయిన పూర్ణచంద్రరావు, లింగాల గోవింద్, వెంకటరామిరెడ్డి, నర్రా గురవారెడ్డి, పుర్రు కొండ పాల్గొన్నారు.

చిగుళ్ళ సుమలతకు ఉమెన్ ఐకాన్ అవార్డు

ముప్పాళ్ళమార్చి24: నవయువతరం ఫౌండేషన్ అధినేత చిగుళ్ళ సుమలతకు ఉమెన్స్ వరల్డ్‌రికార్డ్స్, అవార్డ్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఉత్తరప్రదేశ్ ఉమెన్ ఐకాన్ అవార్డుకు ఎంపిక చేసింది. కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను కలసి ఆయన చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కళారంగం, సేవారంగం, విద్యారంగం, వైద్యరంగాల్లో చేసిన సేవలకు గానూ అవార్డు ఎంపిక చేసినట్లు సుమలత తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ సేవారంగాలలో ప్రతిభ కనబరిచిన ఎన్జీవో విభాగంలో నవయుతరం ఫౌండేషన్‌కు అవార్డు ఇచ్చారని తెలిపారు.

వైభవంగా నిదానంపాటి అమ్మవారి తిరునాళ్ల

దుర్గి, మార్చి 24: మండలంలోని అడిగొప్పుల శివారులో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి సైదమ్మబాయి పటిష్ట చర్యలు తీసుకున్నారు. అడిగొప్పుల గ్రామం నుంచి కుంకుమబండ్లు మేళతాళాలతో భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నాయి. భక్తులు మొక్కుబడులు తీర్చుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల వారు భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించారు. పోలీసులు తగిన బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన నిదానంపాటి అమ్మవారు

ఆర్యవైశ్యులను ఆదుకున్నది టీడీపీనే..

- కూటమి గురజాల నియోజకవర్గ అభ్యర్థి యరపతినేని
- ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న యరపతినేని

గురజాలటౌన్, మార్చి 24: గురజాల నియోజకవర్గంలో ఆర్యవైశ్యులను అన్ని విధాలుగా ఆదుకున్నది టీడీపీనే అని కూటమి గురజాల నియోజకవర్గ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో పట్టణ, మండల ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో యరపతినేని పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో ఆర్యవైశ్యుల వ్యాపారాలపై దాడులు చేయడం, వారి స్థలాలను ఆక్రమించుకోవడం అధికమైందన్నారు. వాసవీ అమ్మవారి స్థలాలనూ ఆక్రమించుకుంటున్నారంటే ఎంతటి నీచానికి పాల్పడున్నారో అర్థం చేసుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చనిపోతే కనీసం జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించకపోవడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఓటరూ ఆలోచించి ఓటు వేయాలన్నారు. టీడీపీ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని, మరలా టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. టీడీపీ హయాంలో ఆర్యవైశ్యులకు ఏ సమస్యలు రాలేదన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించామని గుర్తు చేశారు. ఆర్యవైశ్యుల్లో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి నిర్మాణాలు చేపడతామని హామీనిచ్చారు. రానున్న ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని యరపతినేని కోరారు. ముందుగా గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి యరపతినేని నివాళులర్పించారు. యరపతినేనిని ఆర్యవైశ్యులు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు, మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావు, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు నేలవల్లి వరలక్ష్మి బొల్లయ్య, చాగంటి శ్రీను, కొట్టే శ్రీను, బడిదెల శ్రీనివాసరావు, ఉప్పిడి నరసింహారావు, ఏలూరి శశికుమార్, ఎక్కలూరి రామకృష్ణ, ఆవుల పిచ్చయ్య గుప్త యేచూరి శ్రీనివాసరావు, పంతంగి నాగేశ్వరరావు, చిన్ని శ్రీనివాసరావు, మూర్తి శ్రీనివాసరావు, బొగ్గారపు అక్కేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ. 30 లక్షలు ఇస్తానని.. రూ. 30 కూడా ఇవ్వలేదు

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో ఆర్యవైశ్యులు మాట్లాడుతూ 2019 ఎన్నికలసమయంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్యులతో కాసు మహేష్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారని, ఆ సమావేశంలో వైసీపీ అధికారంలోకి రాగానే ఆర్యవైశ్యుల వృద్ధాశ్రమానికి రూ.30 లక్షలు ఇస్తామని హామీనిచ్చారన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడిచినా ఇప్పటి వరకు రూ. 30 కూడా ఇవ్వలేదని ఆర్యవైశ్యులు మండిపడ్డారు. టీడీపీ హయాంలో ఆర్యవైశ్యుల వృద్ధాశ్రమానికి యరపతినేని శ్రీనివాసరావు రూ.20 లక్షలు అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో యరపతినేనిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో యరపతినేని ప్రత్యేక పూజలు

మండలంలోని గంగవరంలో వేంచేసియున్న శ్రీవీరభద్రస్వామి 30వ కల్యాణ వార్షికమహోత్సవాల్లో యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆప్రాంతంలోని టీడీపీ నేతలు పేరుపోగు మరియదాసు, మాజీ సర్పంచ్ పేరుపోగు శాంతమ్మలను పరామర్శించారు.

పార్టీలో చేరిన వారికీ ప్రాధాన్యం..

సత్తెనపల్లి, మార్చి24: వైసీపీనివీడి టీడీపీలో చేరినవారికి పార్టీపరంగా ప్రాధాన్యమిస్తామని టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు.ముపాళ్లకు చెందిన కందుల శ్యామ్, కృపారావు, జక్రయ్య రూబెన్, వర్మ, సంతోషమ్మ, పాపాయమ్మ, మేరి, సుగుణ, స్వాతి, జనరాజుపల్లి శ్యామల, సాగర్, వంశీలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



కన్నా సమక్షంలో టీడీపీలో చేరిన ముపాళ్ల ఎస్సీ కాలనీ వాసులు

మహిళా ఓటర్లే అధికం

రెంటచింతల,మార్చి 24: మాచర్ల నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా వున్నారని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్య 2,59,279 మంది ఓటర్లుండగా వారిలో మహిళలు 1,32,031 కాగా పురుషులు 1,27,226 మంది. 28 మంది థర్డ్ జండర్ వున్నారన్నారు. 4,805 మంది మహిళలు అధికంగా ఉన్నారన్నారు. ఏప్రిల్ 15 వరకు నూతన ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నందున స్వల్పంగా ఓటర్ల సంఖ్య పెరగవచ్చని అధికారులు తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్లో

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

కారంపూడి, మార్చి 24: కారంపూడి ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నయోమి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మే 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరామర్శ ..

సత్తెనపల్లి, మార్చి 24 : మండలంలోని పాకాలపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త షేక్ మాబూ సుభానీ పాము కాటుకు గురై సత్తెనపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ వైద్యశాలకు వెళ్ళి సుభానీని పరామర్శించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు ఉన్నారు.

రాజధాని పేరుతో మోసం..

సత్తెనపల్లి, మార్చి 24 : రాజధాని పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలను మోసం చేశాడని హైకోర్టు న్యాయవాది, టీడీపీ నేత ఉల్లం శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం, కర్నూలులో రాజధాని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన జగన్ అతని అనుచరులు ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారన్నారు. అన్ని రకాలుగా రాష్ట్ర ప్రజలను మోసం చేసిన వైఎస్ జగన్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు.



ప్రజలకు అభివాదం తెలుపుతున్న భాష్యం ప్రవీణ్

భాష్యం ప్రవీణ్‌కు ఘన స్వాగతం

క్రోసూరు, మార్చి 24 : క్రోసూరు మండలం ఆవులవారిపాలెంలో టీడీపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు కార్యకర్తల నుంచి ఘన స్వాగతం లభించింది. వందలాది మంది భాష్యం ప్రవీణ్‌ను ఊరి బయట నుంచి ఊరేగింపుగా గ్రామానికి తీసుకు వచ్చారు. ఇంటింటికి తిరిగి ఆయన ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ప్రవీణ్ వెంట వెన్నా సాంబశివారెడ్డి, వేగుంట రాణి, జనసేన బీజేపీ నాయకులు ఉన్నారు.

అమరావతి: భాష్యం ప్రవీణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ప్రవీణ్ సతీమణి భాష్యం లావణ్య ఆదివారం మండల పరిధిలోని నెమలికల్లు గ్రామంలో ప్రచారం నిర్వహించారు.

అచ్చంపేట: పెదపాలెం, మిట్టపాలెం గ్రామాల్లో మండల ఎన్నికల ఇన్‌చార్జి భాష్యం ప్రసాదు ఆధ్వర్యంలో ఆదివారం శంఖా రావం కార్యక్రమం నిర్వహించారు. భాష్యం ప్రవీణ్ పిలుపు మేరకు నందిగం ఆశీర్వాదం అధ్యక్షతన ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు.

ఘనంగా మట్టల ఆదివారం

విజయపురిసౌత్, మార్చి 24: స్థానిక చర్చిలలో మట్టల ఆదివారంను ఘనంగా నిర్వహించారు. మట్టలను వివిధ రకాల పూలతో అలంకరించి భక్తులు చర్చిలకు చేరుకున్నారు. సాగరమాత ఆలయంలో ఈత మట్టలను చేతబూని తేరు ప్రదిక్షణ గావించారు. విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ భక్తులకు దైవ సందేశం అందించారు.

మాచర్లరూరల్: మాచర్ల పట్టణంలోని తెలుగు బాప్టిస్టు చర్చి పాస్టర్ డొక్కా రవికుమార్, నాగెండ్ల విక్టోరియా రాణి ఆధ్వర్యాన మట్టలను చేతబూని క్రీస్తు స్తుతి గీతాలను ఆలపిస్తూ పట్టణంలో ర్యాలీ జరిపారు. ర్యాలీలో సంఘ పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

మాచర్లటౌన్: పట్టణంలోని బెరాకా ప్రార్థనా మందిరంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు ఆయనను సన్మానించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని లూథరన్ చర్చిలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఏసుదానం మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు.

మాచవరం : మండలంలోని వేమవరం, మాచవరం, చెన్నాయపాలెం, మోర్జంపాడు, గంగిరెడ్డిపాలెం, తదితర గ్రామాలలో ఆయా గ్రామాల చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఈత ఆకులను పూలతో అలంకరించి ఆయా గ్రామాలలోని పురవీధులలో పాటలు పాడుకుంటూ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం సమయంలో ఆయా గ్రామాల చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ప్రార్థనలలో పాస్టర్లు జీవిత ప్రకాష్, సుందరరావు, గురుప్రసాద్ పాల్గొన్నారు.

క్రోసూరు: స్థానిక ఏఈఎల్ చర్చి ఫాదర్ సుందరరావు ఆధ్వర్యంలో వందలాది మంది క్రైస్తవులు ఈత మట్టలను చేతబూని ఊరేగింపులో పాల్గొన్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సండే స్కూల్ విద్యార్థులు క్రైస్తవ గీతాలను ఆలపించారు.



సాగరమాత ఆలయంలో తేరు ప్రదక్షిణ చేస్తున్న క్రైస్తవులు

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డీఎం

- బస్టాండ్ వద్ద యూనియన్ నేతల గేట్ మీటింగ్

సత్తెనపల్లి,మార్చి24: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ఆరోపించారు. డిపో మేనేజర్ వైఖరిని నిరసిస్తూ ఆదివారం బస్టాండ్ ఆవరణంలో యూనియన్ నేతలు కోటేశ్వరావు, బీకే రావు, జీటీ రావు, యల్లమంద, హుస్సేన్, భాస్కర్, ఎన్‌బీకేలు నల్ల బ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధ నలకు విరుద్ధంగా డిపోలోని ఇద్దరు కండక్టర్లను సస్పెండ్ చేశారని, 2017 ఏరియర్స్ చెల్లింపులో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని, ఐటి ట్యాక్స్ పరిధిలో లేని వారి నుంచి కూడా టాక్స్ కట్ చేశారని, 1బై19 సర్క్యులర్‌ను అమలు చేయటం లేదని ఆరోపణలు చేశారు. తిరుపతికి సింగిల్ డ్రైవర్ డ్యూటీచేస్తేచే ఆ ఇద్దరూ ఉద్యోగుల సస్పెండ్ ఎత్తి వేస్తామని డీఎం చెప్పడం సరికాదన్నారు. డీఎం వైఖరికి నిరసనగా డబుల్‌డ్యూటీలు బాయికాట్ చేయాలని నిర్ణయించామన్నారు. అయితే తాను నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నానని డిపో మేనేజర్ విజయకుమార్ తెలిపారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

గురజాలటౌన్, మార్చి 24: రంజాన్ మాసంను పురస్కరించుకొని సుందరగిరి అబ్దుల్ సత్తార్ జ్ఞాపకార్థం అతని కుమారుడు షౌకత్ శనివారం పట్టణంలోని పలువురు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. వీటిద్వారా స్వయం ఉపాధి పొందాలని షౌకత్ ఆకాంక్షించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

- రూ. 2 లక్షల ఆస్తి నష్టం

పిడుగురాళ్ల, మార్చి 24: విద్యుదాఘాతంతో జూలకల్లుకు చెందిన పాలపర్తి తిరుపతిరావు పూరిల్లు శనివారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని బియ్యంతో పాటు, బీరువాలో ఉన్న రూ. 50 వేల నగదు, కొంత బంగారం సగం వరకు కాలి ముద్ద అయ్యాయి. పిడుగురాళ్ల అగ్నిమాపకశాఖకు సమాచారం అందించగా వాహనం దారి మధ్యలో మరమ్మతులకు గురికావడంతో సంఘటనా స్థలానికి చేరుకోలేక పోయింది. గ్రామస్థులే స్పందించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో తమకు రూ.2 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తిరుపతిరావు తెలిపారు.

వలంటీరుపై వేటు

కారంపూడి, మార్చి 24: మండల కేంద్రమైన కారంపూడి - 2 సచివాలయ వలంటీరు షేక్ మజూజిని విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి రాజకీయపార్టీల ఫోటోలు, వీడియోలు స్టేటస్‌లో పెట్టినందుకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

నిషేధిత వలలతో చేపలు పడితే కఠినచర్యలు

మాచవరం,మార్చి24: పల్నాడుజిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు ఆదేశాల మేరకు మాచర్ల పర్యవేక్షకులు టీవీ శ్రీనివాసరావు ఆదివారం మాచవరం మండలంలోని వెల్లంపల్లి కృష్ణా పరివాహక ప్రాంతంలో చేపలు పట్టే ప్రదేశాలను పరిశీలించారు. నిషేధిత వలలతో చేపలు పడుతున్నారనే సమాచారంతో సంజీవరావు ఆదేశాల మేరకు సదరు ప్రదేశాన్ని పరిశీలించి సుమారు రూ.4 లక్షల విలువ కలిగిన రెండు నిషేధిత వలలను స్వాధీనం చేసుకొని మాచవరం పోలీసులకు అప్పగించారు. వలలు ఉపయోగిస్తున్న గొర్రె శ్రీనివాసరావు, మేఘావత్ బిక్షునాయక్‌లపై మాచవరం పోలీస్‌స్టేషన్‌లో మత్స్య శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. ఎవరైనా నిషేధిత వలలతో చేపల వేట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ అధికారి బీ. శ్రీనివాసనాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

పోలింగ్ కేంద్రాల్లో ఈఆర్వో తనిఖీ

మాచర్ల రూరల్, మార్చి 24: మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో సమకూర్చుతున్న వసతులను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సరఫరాపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాచర్ల పట్టణంలో వాహనాల తనిఖీ ..

మాచర్లటౌన్ : రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ శనివారం రాత్రి రెవెన్యూ, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలతో కలసి వాహనాల తనిఖీ నిర్వహించారు. పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ధనుంజయరెడ్డి ఉన్నారు.

నియోజక వర్గంలో రౌడీ రాజ్యం ..

- కంచేటి సాయి, టీడీపీ నేతలపై అక్రమ కేసులు సరికాదు
- పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్



విలేకరులతో మాట్లాడుతున్న భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు/బెల్లంకొండమార్చి 24: పెదకూరపాడు నియోజకవర్గంలో రౌడీరాజ్యం రాజ్యమేలుతోందని నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమరావతి మండలంలోని ధరణికోటలో వైసీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ వారే తగలబెట్టి, టీడీపీకి చెందిన కంచేటి సాయి, దండా నాగేంద్ర, షేక్ జానీల పై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే శంకరరావు తనయుడు కళ్యాణ్ 500మంది రౌడీలతో కంచేటి సాయి గ్రామానికి వెళ్ళి భయభ్రాంతులకు గురిచేశారని, శంకరరావు కుటుంబం నుంచి సాయికి ప్రాణ హాని ఉందన్నారు. విదేశాలకు వెళ్ళేందుకు బొంబాయి ఎయిర్ పోర్టులోవున్న సాయిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం సరైంది కాదన్నారు. గతంలో వైసీపీలో శంకరరావుతో వున్న సాయికే ఇలాంటి పరిస్థితి వచ్చిందని, దీనిగురించి ఇప్పుడున్న వైసీపీ శ్రేణులు ఆలోచించు కోవాలన్నారు.

క్రోసూరు: పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ నాయకులు కంచేటి సాయి పై అక్రమ కేసులు బనాయించటం శోచనీయం అని క్రోసూరు మండల టీడీపీ నేతలు విమర్శించారు. ఎవరో చేసిన చర్యలకు వైసీపీ టెంట్ కాలిపోతే దానిని టీడీపీ వారికి ఆపాదించి కంచేటి సాయి, దండా నాగేంద్ర, జానీలపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. ఎవరు ఎన్ని కేసులు పెట్టినా టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ గెలుపును అడ్డుకోలేరన్నారు. సమావేశంలో కాంద్రు కాశయ్య, గుడిపాడు బాషా, సదావివరావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, వెంకట రామిరెడ్డి, బాలరామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు..

బెల్లంకొండ,మార్చి 24: టీడీపీపై నమ్మకంతోనే వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని మాచాయపాలెంగ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు క్రోసూరు మండలం ఆవులవారి పాలెం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రవీణ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన పెద సాగర్, సాగర్, రాజు, కోటేశ్వరరావు, రామయ్యనరేంద్ర తదితరులు మాచాయపాలెం మాజీ ఎంపీటీసీ గుడిసె కొండయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

కోడింగ్ డీకోడింగ్

పార్ట్-2

1. ఒక సంకేత భాషలో BENGALను DGPICNగా రాశారు. అయితే అదే సంకేత భాషలో REGIONను ఏవిధంగా రాస్తారు?
   ఎ) TGIKQP బి) TIKQPG సి) TKGQPI డి) GIKTPQ

సమాధానం: (ఎ)

వివరణ:

2 5 14 7 1 12	ఇదేవిధంగా	18 5 7 9 15 14
B E N G A L		R E G I O N
+2 +2 +2 +2 +2 +2		+2 +2 +2 +2 +2 +2
D G P I C N		T G I K Q P
4 7 16 9 3 14		20 7 9 11 17 16

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలిస్తే +2 అని తెలుస్తున్నది.

2. ఒక సంకేత భాషలో BOUGHTను ANTFGSగా రాసిన అదే సంకేత భాషలో GOVERNను ఏవిధంగా రాస్తారు?



ఎ) FNUDQM బి) NFUDMQ సి) FNUQMD డి) FNQDMU

సమాధానం: (ఎ)

వివరణ:

2 15 21 7 8 20	ఇదేవిధంగా	7 15 22 5 18 14
B O U G H T		G O V E R N
-1 -1 -1 -1 -1 -1		-1 -1 -1 -1 -1 -1
A N T F G S		F N U D Q M
1 14 20 6 7 19		6 14 21 4 17 13

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలించిన -1 అని తెలుస్తున్నది.

3. ఒక కోడ్‌లో DIRECTను EHSDDSగా రాస్తే ఇదే కోడ్‌లో PLAYER ఎలా రాస్తారు?
   ఎ) QKBXFQ బి) QBKQFX సి) OURMNFUL డి) QKBQFX

సమాధానం: (ఎ)

వివరణ:

4 9 18 5 3 20	ఇదేవిధంగా	16 12 1 25 5 18
D I R E C T		P L A Y E R
+1 -1 +1 -1 +1 -1		+1 -1 +1 -1 +1 -1
E H S D D S		Q K B X F Q
5 8 19 4 4 19		17 11 2 24 6 17

గా రాస్తారు.

పోటీ పరీక్షల ప్రత్యేకం

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలించిన +1, -1 అని తెలుస్తున్నది.

4. ఒక సంకేత భాషలో 'SPECIAL'ను 'PNDCJCO'గా రాశారు. అదే సంకేత భాషలో 'CREATOR'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) ZPCAVQU బి) ZQCAVQU సి) ZPDAUQU డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ:

19 16 5 3 9 1 12	ఇదేవిధంగా	29 18 5 1 20 15 18
S P E C I A L		C R E A T O R
-3 -2 -1 0 +1 +2 +3		-3 -2 -1 0 +1 +2 +3
P N D C J C O		Z P D A U Q U
16 14 4 3 10 3 15		26 16 4 1 21 17 21

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే -3, -2, -1, 0, +1, +2, +3 పద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

5. ఒక సంకేత భాషలో 'GREAT'ను 'HTHEY'గా రాశారు. అదే సంకేత భాషలో 'INDIA'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) JPGNE బి) JPGMF సి) JQGNF డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ:

7 18 5 1 20	ఇదేవిధంగా	9 14 4 9 1
G R E A T		I N D I A
+1 +2 +3 +4 +5		+1 +2 +3 +4 +5
H T H E Y		J P G M F
8 20 8 5 25		10 16 7 13 6

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే +1, +2, +3, +4, +5 పద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

6. ఒక సంకేత భాషలో 'MERCY'ను 'NCUYD'గా రాశారు. అదే సంకేత భాషలో 'DREAM'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) EPHWR బి) EWHVR సి) EHPRW డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ:

13 5 18 29 25	ఇదేవిధంగా	4 18 5 27 13
M E R C Y		D R E A M
+1 -2 +3 -4 +5		+1 -2 +3 -4 +5
N C U Y D		E P H W R
14 3 21 25 30		5 16 8 23 18

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలకు గమనిస్తే +1, -2, +3, -4, +5 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

7. ఒక సంకేత భాషలో 'PUBLIC'ను 'OWYPDI'గా రాశారు. అదే సంకేత భాషలో 'MASTER'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) LCPXZX బి) LPCXXZ సి) LPCXZX డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ:

16 21 28 12 9 3	ఇదేవిధంగా	13 1 19 20 31 18
P U B L I C		M A S T E R
-1 +2 -3 +4 -5 +6		-1 +2 -3 +4 -5 +6
O W Y P D I		L C P X Z X
15 23 25 16 4 9		12 3 16 24 26 24

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే -1, +2, -3, +4, -5, +6 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

నోట్: A, B, C, D, Eలకు కొన్ని సందర్భాలలో 27, 28, 29, 30, 31 ఈ విధంగా తీసుకున్నాం. Z తరవాత ఇంకా అక్షరాలు అవసరమైతే మరలా Aను 27, Bను 28గా ఇలా భావించాలి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి DIKSUCHI

శరణార్థుల పౌరసత్వ కల్పనకు ఉద్దేశించిన 'సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ 2019'కి సంబంధించిన రూల్స్ కేంద్రప్రభుత్వం 2024 మార్చి 11న నోటిఫై చేసింది. అలా ఈ చట్టాన్ని అమలులోకి తీసుకురావడంతో, అందులో ఉన్న కొన్ని పరిమితులు, సడలింపుల దృష్ట్యా నిరసనలు చెలరేగుతున్నాయి. ఈ నేపథ్యంలో దాని పూర్వాపరాలు, చట్టంలోని అంశాలు, వస్తున్న విమర్శలు, ప్రభుత్వ వర్గాల వివరణ వంటివి పరిశీలిద్దాం.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్

తమ దేశంలోనే తాము పరాయివారు అయినప్పుడు, నిలువ నీడలేని పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ప్రజలు ఎక్కడికైనా పరుగులు పెడతారు. పరాయి దేశమైనా అక్కున చేర్చుకుంటుందేమో అని ఆశపడుతుంటారు. అలా శరణార్థులు వేల, లక్షల సంఖ్యలో సరిహద్దు దేశాలకు చేరుకోవడం సహజం. భారత్ కూడా అందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే సరైన పత్రాలు, గుర్తింపు ధ్రువీకరణలు లేకుండా దేశంలోకి వచ్చే శరణార్థులతో అటు వారికే కాదు ఇటు దేశ భద్రతకూ ముప్పే. స్థానికుల నుంచి వారు తీవ్ర దోపిడీకి గురవడం, సామాజిక భద్రతా సౌకర్యాలను పొందలేకపోవడం, పేదరికం కారణంగా నేరాల బాట పట్టినా వారిని గుర్తించడం కష్టమవుతుంది. ఆ మాటున ఉగ్రవాదులు చొరబడటం వంటి కారణాల రీత్యా దేశంలోకి వచ్చే శరణార్థులకు చట్టబద్ధ గుర్తింపు అవసరం. తిరిగివెళ్లే అవకాశాలు సమీప భవిష్యత్తులో కనిపించనప్పుడు వారికి పౌరసత్వం కల్పించి ఆదుకోవడం కూడా సముచితమే.

ఈ పౌరసత్వ సవరణ చట్టానికి నాంది 2002లోనే పడింది. పాకిస్థాన్‌లో తీవ్ర దౌర్జన్యాలకు గురవుతున్న స్థానిక హిందువులకు భారత దేశ వీసాలు పొందేందుకు సహకరించాలని, అదే సమయంలో అక్రమ ప్రవేశాలను అడ్డుకోవాలని ఒక సరిహద్దు రాష్ట్రంగా రాజస్థాన్ ప్రభుత్వం అప్పటి ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి విన్నవించింది.

దీని ఫలితంగా 2004లో అప్పటి ప్రధాని వాజపేయీ ప్రభుత్వం, పౌరసత్వ నిబంధనలను సవరించింది. రాజస్థాన్, గుజరాత్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంత జిల్లాల మెజిస్ట్రేట్‌లకు - లాంగ్ టర్మ్ వీసా లు, పౌరసత్వం కల్పించే అధికారాన్ని కల్పించింది.

అదేవిధంగా 2010 జూన్‌లో అప్పటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కూడా కొన్ని వర్గాలకు చెందిన పాకిస్థానీయులకు వారి పాస్‌పోర్టు వాలిడిటీతో సంబంధం లేకుండా, లాంగ్‌టర్మ్ వీసాలను పునరుద్ధరించవచ్చని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు అనుమతినిచ్చింది. దీనికి 2009 డిసెంబరు 31ని కటాఫ్ డేట్‌గా నిర్ణయించింది.

అంటే అప్పటిలోగా లాంగ్‌టర్మ్ వీసాలను పొందిన పాకిస్థానీ హిందువులు, సిక్కులు, భారతీయ వ్యక్తిని వివాహం చేసుకొని భారత్‌లో నివసిస్తున్న పాకిస్థానీ మహిళలు, పాకిస్థానీయులను వివాహం చేసుకొని విడాకులు పొందిన భారత స్త్రీలు/ వితంతువులు, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న వారికి ఈ వీసా పొడిగింపును కల్పించింది. అదేవిధంగా భారతీయ ముస్లిం తన కుటుంబాన్ని వదిలి దేశవిభజన సమయంలో పాకిస్థాన్‌కు వెళ్లిపోయి, తదుపరి వాలిడ్ పాకిస్థాన్ పాస్‌పోర్టుతో తిరిగివచ్చి కేరళలో స్థిరపడిన సందర్భంలో కూడా లాంగ్‌టర్మ్ వీసాను అందించారు. 2014 డిసెంబరులో నరేంద్రమోడీ ప్రభుత్వం పాకిస్థాన్ నుంచి వచ్చిన హిందూ, సిక్కు, క్రిస్టియన్, బుద్ధిస్ట్ శరణార్థులకు పౌరసత్వం ఇచ్చేందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2015-16లో భారతదేశంలో ప్రవేశానికి సంబంధించిన పాస్‌పోర్ట్ రూల్స్ సవరించి పాక్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి వచ్చిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రిస్టియన్ శరణార్థులకు సరైన పాస్‌పోర్ట్/ వీసా ధృవీకరణలు లేనప్పటికీ అనుమతించేవిధంగా నియమ నిబంధనలను మార్చారు.

తదుపరి 2018లో ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీచేసి ఈ వర్గాల వారు భారతీయ పౌరసత్వం పొందాలనుకుంటే వారిని లాంగ్‌టర్మ్ వీసాలకు అర్హులను చేసింది. అదేవిధంగా వారు ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకోవడానికి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి, బ్యాంక్ అకౌంట్స్ తెరవడానికి, ఇల్లు కొనుగోలుకు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను పొందడానికి వారిని అనుమతించడం వంటి సౌలభ్యాలు కల్పించింది.

ఈ నోటిఫికేషన్ల స్థానంలో సమగ్ర విధివిధానాలను రూపొందించేందుకు కేంద్రం 1955 నాటి పౌరసత్వ చట్టాన్ని సవరించింది. తాజాగా 2019లో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చింది. అయితే కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలకు చెందిన శరణార్థులకు మాత్రమే అనుమతివ్వడం, ఇతర సరిహద్దు దేశాల శరణార్థులకు, ముస్లిం మతస్థులకు అనుమతి లేకపోవడం విషయమై తీవ్ర విమర్శలు చెలరేగి దేశవ్యాప్త నిరసనలు ఉధృతమయ్యాయి. అయితే 2019 డిసెంబర్ నాటికి చిన్నగా మొదలై దేశంలో కరోనా పరిస్థితులు ప్రారంభమైన సమయంలో ఈ నిరసనలూ సద్దుమణిగాయి. అయితే ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ వంటి సంస్థలు; అసోం గణపరిషత్, నేషనల్ పీపుల్స్ పార్టీ, డిఎంకే వంటి రాజకీయ పార్టీలు; జైరాం రమేష్, మహువా మొయిత్రా వంటి ప్రముఖులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ విషయమై సుప్రీంకోర్టులో దాదాపు 200లకు పైగా పిటీషన్లు ఫైల్ అయ్యాయి.



> **ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకోవడానికి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి, బ్యాంక్ అకౌంట్స్ తెరవడానికి, ఇల్లు కొనుగోలుకు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను పొందడానికి వారిని అనుమతించడం వంటి సౌలభ్యాలు కల్పించింది.**

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

గనుల శాఖలో ఘనుడు!

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ రహస్యమే. ఒక కంపెనీలో ఉద్యోగి అయి ఉండి, మరో నాలుగు కంపెనీల పనులు కూడా ఎండీసీలో చక్కబెడుతుండటం ఆయనకే చెల్లింది. అందుకే ఎండీసీ అధికారులు, సిబ్బంది ఆయన్ను 'కార్పొరేట్ లాబీయిస్ట్'గా పిలుస్తుంటారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన కంపెనీకి ఇప్పించిన బెరైటీస్ కాంట్రాక్ట్ కార్యరూపం దాల్చలేదు. అది నిబంధనల ప్రకారం 2010లోనే రద్దవ్వాల్సి ఉంది. దాన్ని రద్దుచేయనివ్వకుండా నిరంతరం లైవ్‌లో ఉండేలా ప్రయత్నిస్తున్నారు. ఇక, ఆ సంస్థ కోసం మంగంపేటలోనే ఓ ప్లాంటు పేరు చెప్పి 100 ఎకరాలు ఇప్పించేందుకు ప్రతిపాదనను కదిలించారు. ఎప్పుడో రద్దవ్వాల్సిన ఒప్పందం 16 ఏళ్ల తర్వాత కూడా కొనసాగడం, ఆ కంపెనీకే 100 ఎకరాలు ఇప్పించేందుకు ఆఘమేఘాల మీద ప్రతిపాదనలు రెవెన్యూ దాకా తీసుకెళ్లడంలో ఆయనదే కీలక పాత్ర. భూమి ఇవ్వడం కుదరదని రెవెన్యూ చెప్పినా గనుల శాఖతో రెండోసారి లేఖలు రాయించేలా లాబీయింగ్ చేయగలిగారు. ఇందులోనే ఓ పెద్ద మతలబు ఉంది. 2008 నాటి ఒప్పందం ప్రకారం 100 ఎకరాలు ఇస్తే, ఆనాడు నిర్ణయించిన ధర మేరకే బెరైటీస్‌ను సరఫరా చేయించేలా ఎండీసీని ఒప్పించడం మరో పెద్ద లాబీ. ఇప్పుడు ఆయన దృష్టంతా దీనిపైనే ఉంది. అదే జరిగితే ఎండీసీ నిండా మునిగిపోనుంది. చిన్న కంపెనీలు తమకు ఎక్కడ పోటీ వస్తాయో అన్న భయంతో వాటిని ఎండీసీ ప్రోత్సహించకూడదంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఇదే అంశంపై ఎండీసీ ఎండీకి లేఖ కూడా రాశారు. దీనిపై నాటి ఎండీ తీవ్రంగా స్పందించారు. "నీకు ఈ విషయంలో సంబంధం లేదు. అనవసర విషయాల్లో వేలు పెట్టవద్దు" అని తీవ్రంగా హెచ్చరించారు. అంతే, తన పలుకుబడిని ఉపయోగించి నాటి ఎండీనీ ఆ పోస్టు నుంచి తప్పించారు. ఎండీగా మధుసూదన్ రెడ్డి ఉన్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

ఎవరికి ఏ పనిచెప్పాలో కూడా

బెరైటీస్, క్వార్ట్జ్, ఇతర ఖనిజాల టెండర్లు ఎవరికి ఇవ్వాలి? ఏ ఉద్యోగిని ఏ విభాగంలో కూర్చోబెట్టాలి? ఏ అధికారికి ఏయే సబ్జెక్టులు కట్టబెట్టాలో పెద్ద లిస్టే ఇచ్చారు. వాటిని మధుసూదన్‌రెడ్డి పట్టించుకోకుండా, అధికారుల పనితీరు ఆధారంగా విధులు అప్పగించారు. దీంతో 'నా మాటే వినరా' అంటూ సదరు లాబీయిస్టు రచ్చచేశారు. దీంతో ఆయనను ఆఫీసు రిసెప్షన్‌కే పరిమితం చేశారు. ఆఫీసుల్లోని విభాగాలకు వెళ్లకుండా నియంత్రించారు. దీంతో అనేక లాబీయింగ్ పనులు నిలిచిపోయాయి. తన కంపెనీ పెద్దను తీసుకొచ్చి మధుసూదన్‌రెడ్డిని మచ్చిక చేసుకుని, మరోసారి పొరపాటు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. మధుసూదన్ రెడ్డి బదిలీ తర్వాత లాబీయిస్ట్‌కు మళ్లీ మునుపటి స్వేచ్ఛ వచ్చింది.

మార్కెటింగ్ విభాగం అడ్డాగా వ్యవహారాలు

ఎండీసీలో మార్కెటింగ్ విభాగం కీలకమైంది. దీనిలోని ఓ అధికారి ఈ లాబీయిస్ట్‌కు సన్నిహితుడు. అంతే మార్కెంటింగ్ విభాగం అడ్డాగా ఆయన ఎండీసీలోని పరిపాలన, వ్యాపార పరమైన అంశాలతోపాటు బిల్లుల చెల్లింపు, లీజుల అనుమతి వరకు తను శాసించగలిగేలా ఎదిగారు. తన కంపెనీల పనులతోపాటు మరో నాలుగు కార్పొరేట్ పనుల ఫైళ్ల పరిష్కరించేందుకు నేరుగా విభాగాలకు వెళ్లడం, అక్కడి వారికి ఆదేశాలు ఇచ్చి ఆగమేఘాల మీద పనులు చేయాలని ఒత్తిడి తీసుకొస్తుంటారు. వారు వింటే సరే. కాదన్న వారికి గనుల శాఖలోని ముఖ్య అధికారి కార్యాలయం నుంచి ఫోన్‌లు చేయిస్తారు. అయినా కూడా మాట వినని వారికి ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఓ అధికారి నుంచి ఫోన్‌లు చేయిస్తుంటారు. ఇంత జరిగాక లాబీయిస్ట్ చెప్పిన పనులు ఎందుకు ఆగుతాయి? ఆయన చెప్పిన వారికే ఖనిజ తవ్వకాల దరఖాస్తుల పరిష్కారం లభిస్తుంది. లీజుల అనుమతులు ఇస్తున్నారు. బిల్లుల చెల్లింపు కూడా చకచకా జరుగుతుంది.



పనిని బట్టి రేటు

'లాబీయిస్ట్' శక్తి తెలుసుకున్న పలు కంపెనీలు, కాంట్రాక్టు సంస్థలు తమ పనులు చక్కబెట్టాలంటూ ఈయననే ఆశ్రయించడం, దీనికి ఆయన పనిని బట్టి రేటును నిర్ణయించడం షరా మామూలుగా మారింది. దీంతో గనుల శాఖ నుంచి ఆర్థికశాఖ, రెవెన్యూ, పరిశ్రమలు, పురపాలక శాఖ, ఆర్‌అండ్‌బీ విభాగాల్లో కలియ తిరిగి పనులు చక్కబెడుతున్నారని తెలిసింది. ఎండీసీలోని మార్కెటింగ్ విభాగాన్ని అనధికారిక కార్యాలయంగా మార్చుకున్నారు. అక్కడి నుంచే మైన్స్‌తోపాటు ఇతర శాఖల పనులు, వ్యవహారాలు చక్కబెడుతున్నారని తెలిసింది. దీనికి మార్కెటింగ్‌లోనే ఓ అధికారి పూర్తిగా సహకరిస్తున్నట్లు తెలిసింది. ఇక ఆయన చెప్పిన పనులు చేసిపెట్టేవారికి బంపర్ ఆఫర్లు, గిఫ్టులు, ఇతర ప్రోత్సాహకాలు ఇస్తుంటారని తెలిసింది. గనుల శాఖలో ఎవరైనా ఉద్యోగి ఒక రోజు సెలవుపెట్టి ఆఫీసుకు రాకుండా ఉంటారమో కానీ ఈయన మాత్రం ఖచ్చితంగా వస్తుంటారు. ఆయన వచ్చాకే మిగతా పనులు సాగిపోతుంటాయి.

ఎందుకు ప్రోత్సహిస్తున్నారు?

గనుల శాఖ ఓ కార్పొరేట్ ఉద్యోగిని ఎందుకు ప్రోత్సహిస్తోంది? ఇది అందరినీ వేధిస్తున్న ప్రశ్న. ఎండీసీతో వ్యాపారం చేసే మైనింగ్ కంపెనీల ప్రతినిధులు తమ సొంత పనులపై గనుల శాఖ అధికారులను కలిసి వెళ్తుంటారు. తమ విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని కోరుతుంటారు. ఇదంతా రొటీన్‌గా జరిగిపోయేదే. కానీ, ఉద్యోగులకన్నా ముందే ఆఫీసుకు వచ్చి రోజులో 24 గంటలపాటు ఆఫీసులోనే మకాం వేయడమే అసలు సమస్య. సొంత కంపెనీ పనులతోపాటు, ఇతర కంపెనీల వ్యవహారాలు, ఇంకా ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌లు, సబ్జెక్టుల అప్పగింత, లీజులు, బిల్లుల చెల్లింపు వంటి అంశాలను ప్రభావితం చేసేలా ఓ లాబీయిస్టు సర్వాంతర్యామిగా మారితే అధికారులు ఎందుకు మిన్నకుంటున్నారు? అతన్ని ఎందుకు నియంత్రించలేకపోతున్నారు? అతన్ని అడ్డుకోవడంలో ఎందుకు భయపడిపోతున్నారు? ఈ విషయంలో అనేక సందేహాలున్నాయి. అతను లాబీయిస్టుగా మారడం వెనుక ముఖ్య అధికారుల ప్రోత్సాహం కూడా ఉందన్న వాదన వినిపిస్తోంది.

సూపర్-6 పథకాలతో పేదలకు ఎంతో మేలు

● ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు



గోగులపాడులో తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో ఎంపీ కృష్ణ దేవరాయలు, అరవింద బాబు

రొంపిచర్ల, మార్చి 24: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సూపర్-6 పథకాలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అలవాల, కొనకంచివారిపాలెం, గోగులపాడు గ్రామాల్లో ఆయా పథకాలపై జరిగిన కార్యక్రమంలో డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి పాల్గొన్నారు. అలవాలలో మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కాలనీలో అక్కడి వారితో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్ళి సూపర్-6 పథకాల గురించి మహిళలకు వివరించాలన్నారు. అనంతరం కొనకంచివారిపాలెంలో పొనుగోటి వీరాంజనేయులు, అతని కుటుంబ సభ్యులు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. ఫీల్డ్ అసిస్టెంట్ పొనుగోటి రామాంజనేయులు ఇంటికి వెళ్ళి పొనుగోటి పెద వీరయ్యతో ఎంపీ కృష్ణ దేవరాయలు, అరవిందబాబు మాట్లాడారు. అనంతరం గోగులపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సుమారు 60 కుటుంబాలకు చెందిన కాలనీ వాసులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణ దేవరాయలు కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నేతలు పులుకూరి జగ్గయ్య, గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేల్పుల సింహాద్రి యాదవ్, పల్లెల నాగిరెడ్డి, తాడిపర్తి సురేష్, లింగా వెంకటేశ్వర్లు, శాఖమూరి రామ్మూర్తి, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

రొంపిచర్ల, మార్చి 24: మండలంలోని పలు గ్రామాల్లో బీఎస్ఎఫ్ బలగాలతో ఆదివారం కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో సుబ్బయ్యపాలెం, అలవాల, అచ్చయ్యపాలెం, తురుమెళ్ళ, అన్నవరప్పాడు, వీరవట్నం గ్రామాల్లో కవాతును నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని ఎస్ఐ పాల్‌రాజ్ రవీంద్ర సూచించారు.

మహంకాళి ఆలయ వార్షిక తిరునాళ్లకు ఏర్పాట్లు

నరసరావుపేట రూరల్, మార్చి 24: మండలంలోని ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి 49వ వార్షిక తిరునాళ్ళ ఈ నెల 26వ తేది నుంచి 28వ తేది వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డి తెలిపారు. తిరునాళ్ళ సందర్భంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తమండలి చైర్మన్ కె.సాంబశివరావు సభ్యులు కె. వెంకటబదరీనారాయణ, బి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎ.ప్రసాదరావు, డి.రజని, ఎన్.మాధవీదేవి, అభివృద్ధి కమిటీ వైస్ ప్రెసిడెంట్ రాంజేంద్రప్రసాద్, జల్లి శ్రీనివాసరావు, సెక్రటరీ మునగా వెంకట వేణు మాధవరావు, జాయింట్ సెక్రటరీ గడ్డం వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు కూరపాటి అమర్, ఏలూరి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాజశ్యామల యాగం చేస్తున్న జీవీ దంపతులు, పాల్గొన్న మాచర్ల టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, కొమ్మాలపాటి తదితరులు

జీవీ దంపతుల రాజశ్యామల యాగం

వినుకొండ, మార్చి 24: మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అతిథి గృహంలో మూడు రోజులుగా జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి లీలావతి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం రాజశ్యామల యాగం నిర్వహించారు. యాగంలో భాగంగా మూడు రోజులుగా అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. చివరిరోజు ఆదివారం యాగశాలను శాంతి ఆశ్రమ ట్రస్టు వ్యవస్థాపకులు హిమాలయ గురువులు పాల్గొని జీవీ ఆంజనేయులుతోపాటు ఆయన సతీమణి లీలావతిలకు ఆశీర్వచనాలు అందజేశారు. యాగంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ దంపతులతోపాటు మాచర్ల టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు దంపతులు వారికి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నసమర్పణ చేశారు.

ఘనంగా నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల

బొల్లాపల్లి, మార్చి 24: మండలంలోని పేరూరుపాడు, తంగిసీడుపాలెం గ్రామాల్లో శ్రీ నీలంపాటి అమ్మవారి తిరునాళ్ళ ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పేరూరుపాడు, తంగిసీడుపాలెం గ్రామాల్లో భారీ అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పేరూరుపాడులో సాయంత్రం వేళ అమ్మవారి జీవిత చరిత్ర నాటకాలను ప్రదర్శించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు.

నేడు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

నరసరావుపేట రూరల్, మార్చి 24: మండలంలోని లింగంగుంట్లలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప జన్మదినం పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు ఆంజనేయ గురుస్వామి తెలిపారు. సోమవారం ఉదయం 6:00 గంటలకు గణపతి హోమం, స్వామివారి మూల మంత్ర హోమం, 7:00 గంటలకు స్వామివారికి నిత్యాభిషేకము, అష్టాభిషేకము 08:00 గంటలకు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

● టీడీపీ బీసీ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు

బొందిలిపాలెం (శావల్యాపురం) మార్చి 24: అధికారగర్వంతో చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు వైసీపీ నాయకులు మీడియాపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని టీడీపీ బీసీ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ ఒత్తుల వెంకటేశ్వర్లు విమర్శించారు. మండలంలోని బొందిలిపాలేనికి చెందిన వైసీపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను టీడీపీ నాయకులు ఆదివారం ఖండించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు రాజకీయ పార్టీల సమావేశాల్లో పాల్గొనకూడదని తెలిసినా లెక్కచేయకుండా వైసీపీ నాయకులు వ్యవహరించారన్నారు. ఈ నెల 21న ఇన్‌చార్జి సర్పంచ్ విజయ్‌కుమార్ ఇంట్లో నిర్వహించిన వైసీపీ సమావేశంలో ఆర్టీసీ డ్రైవర్ కుంచాల వెంకటస్వామి, వలంటీర్లు పాల్గొన్నట్లు నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ గ్రామపార్టీ అధ్యక్షుడు సోమేపల్లి వెంకట్రావు, గ్రామపార్టీ అధ్యక్షుడు పొనుగోటి వెంకట్రావు, చల్లగుండ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

నరసరావుపేట లీగల్, మార్చి 24: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవి ఆధ్వర్యంలో డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం నుంచి క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ క్షయవ్యాధి ఒక అంటు వ్యాధి అన్నారు. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందన్నారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. జిల్లా లెప్రసీ, క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 1542 టీబీ కేసులు నమోదయ్యాయన్నారు. వీటన్నింటికీ కూడా క్రమం తప్పకుండా వైద్యం, పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హనుమకుమార్, ఆశాలు, ఏఎన్ఎంలు, లెప్రసీ టీబీ కార్యాలయ సిబ్బంది, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఈపూరు: జాతీయ క్షయవ్యాధి నిర్మూలనా కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రమైన ఈపూరులో సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు కాంతారావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, కమలాకరరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● వినుకొండ: ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, టీబీ యూనిట్, మలేరియా సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెండెంట్ ఎస్కే అబ్దుల్‌రజాక్, టీబి యూనిట్ ఎంవోటీసీ డాక్టర్ సౌమ్య, సుభాని, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో తెలుగుదేశం జెండా ఎగరేస్తాం

● డాక్టర్ చదలవాడ అరవిందబాబు



టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలకు కండువాలు కప్పుతున్న అరవిందబాబు

నరసరావుపేట రూరల్, మార్చి 24: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో తెలుగుదేశం జెండా ఎగరవేసి నారా చంద్రబాబు నాయుడుకు కానుకగా అందిస్తామని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. నరసరావుపేట పట్టణానికి చెందిన న్యాయవాది సీతారామాంజనేయులు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఇసప్పాలెం మహంకాళి అమ్మవారి దయతో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, కేంద్రంలో భారతీయ జనతాపార్టీ గెలవాలని కోరుకున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ విజయం సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటప్పకొండలో అరవిందబాబు ప్రత్యేక పూజలు

ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత కోటప్పకొండ జంక్షన్‌లో ఏర్పాటుచేసిన మహాశివుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండపైకి చేరుకుని త్రికోటేశ్వరస్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరో 50 రోజుల్లో ఉమ్మడి ప్రభుత్వం ఖాయం

మరో 50రోజుల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం కొండకావూరు గ్రామానికి చెందిన 50కుటుంబాల వారు అరవిందబాబు సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే అర్హులైన పేదలందరికి 2సెంట్లు స్థలం, పక్కా ఇళ్ళు నిర్మించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తెచ్చుకునేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని పిలుపినిచ్చారు.

ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్‌రెడ్డి కుట్రలు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ

నరసరావుపేట టౌన్, మార్చి 24: భూ హక్కు చట్టం పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్‌రెడ్డి కుట్ర పన్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో బీసీ చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన మూడు ఎకరాలు భూమి వైసీపీ నాయకులు లాక్కోవడంతో మొత్తం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడ్డారని, ప్రజల ఆస్తులు ఏవిధంగా ఆక్రమణలకు గురవుతున్నాయో చెప్పడానికి ఇదొక ఉదాహ రణ అన్నారు. రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి వైసీపీ ఏ విధంగా బీసీల భూములు లాక్కుంటున్నారో రాష్ట్రంలో బీసీలు అర్థం చేసుకోవాలన్నారు. సుబ్బారావు మరణవాంగ్మూలం చదువుతుంటే హృదయవిదారకంగా ఉందన్నారు. ఎంఆర్‌వో లంచం తీసుకొని తమలాంటి వాళ్ళని నాశనం చేస్తున్నారని, ఇది జగన్‌రెడ్డి చట్టంచేసిన హత్యలు అని, జగన్‌రెడ్డి తీసుకొచ్చిన భూహక్కు చట్టం చాలా ప్రమాదకరమైనదన్నారు. ప్రజలు దీని గురించి తీవ్రంగా ఆలోచించి వ్యవస్థలను కాపాడి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని జీవీ ఆంజనేయుల కోరారు.

25 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

పోట్లూరు(శావల్యాపురం)మార్చి 24: శావల్యాపురం మండలం పోట్లూరులో వైసీపీకి చెందిన 25 కుటుంబాలు, కనమర్లపూడిలో చెందిన 10కుటుంబాలు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో ఆదివారం టీడీపీలోకి చేరాయి. బోడెశంభునివారిపాలెం సమీపంలోని గెస్ట్‌హౌస్‌లో నూతనంగా పార్టీలోకి చేరిన కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామనాయకులు అబ్బూరి అంజయ్య, నారయ్య, శ్రీనివాసరావు, రామారావు, రామాంజనేయులు, ఆంజనేయులు, రమేష్, చింతా శ్రీనివాసరావు, గోపాలరావు, లింగా మార్కెండేయులు, గడిపూడి రమేష్, కనమర్లపూడికి చెందిన బోడెపూడి లింగారావు, నర్రా బ్రహ్మయ్య, నలబోలు నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీను, బొంతా మరియబాబు, ముట్లూరి దానియేలు తదితరులు టీడీపీలోకి చేరారు. జీవీ మాట్లాడుతూ కొత్తగా పార్టీలోకి చేరిన కార్యకర్తలందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పించి వారికి అండగా ఉంటామన్నారు. ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనపై విరక్తిచెంది చాలామంది కార్యకర్తలు టీడీపీలోకి చేరుతున్నారని, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమికి ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తుందని, రానున్న ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, మండల తెలుగుయువత అధ్యక్షులు గోనుగుంట్ల ధనుంజయ్, సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు, మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు కందిమళ్ల శివరామకృష్ణ, సీనియర్ నేతలు గడిపూడి విశ్వనాథం, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, బోడెపూడి వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, పొందూరి శ్రీనివాసరావు, లింగా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

డాక్టర్ గోపిరెడ్డి తీరుపై కాసు వర్గం అసంతృప్తి

నరసరావుపేట టౌన్, మార్చి 24: నరసరావుపేట పట్టణంలోని మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి గృహంలో అసమ్మతి వర్గం సమావేశం అయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కేవలం కాసు వర్గానికి చెందిన ఇద్దని మాత్రమే పిలిచి మిగిలిన వారిని విస్మరించటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి అందరినీ కలుపుకుని పనిచేయాలన్నారు. గత ఎన్నికల సమయంలో కూడా కాసు అనుచరులతో సమావేశం నిర్వహించి గెలిచిన అనంతరం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వారందరిని విస్మరించిన చరిత్ర ఉన్నందున పలు విషయాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు.

ఘనంగా మట్టల ఆదివారం



ర్యాలీలో పాల్గొన్న పాస్టర్ సండేస్కూల్ పిల్లలు

వినుకొండ, మార్చి 24: పట్టణంలోని నర్సరావుపేట రోడ్డులోని ఇమ్మానుయేలు తెలుగుబాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో సండే స్కూల్ పిల్లలచే మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సురభి జోసఫ్‌కుమార్, సంఘ సెక్రటరీ బేతం గాబ్రియేలు మోజేస్‌తో పాటు నేలపట్ల శ్యామ్‌ప్రసాద్, గొళ్లపల్లి మేరీరత్నం, ఉషాకిరణ్, పందుల ఫిలిప్, సుందరరావు, జి.ఆదాం, స్పెనం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో బైబుల్ ఫెయిత్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం మట్టల ఆదివారం పండుగను నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో సువార్తను ప్రకటించారు.

● ఈపూరు: మండలంలో మట్టల ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈపూరు లూథరన్ చర్చి ఆధ్వర్యంలో మట్టలను చేతబూని ఊరేగింపు నిర్వహించారు. మట్టల ఆదివారం ప్రాముఖ్యతను పాస్టర్ జాన్ మోజేష్ వివరించారు.ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో చిన్నారులు, యువకులు, యువతులు, దేవుని గీతాలు ఆలపిస్తూ ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.

● బొందిలిపాలెం (శావల్యాపురం): శావల్యాపురం, బొందిలిపాలెం గ్రామాల్లోని విమోచనా ప్రార్ధనా మందిరాలలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ యోహేజ్కేలు భక్తులకు మట్టల ఆదివారం యొక్క విశిష్టతను వివరించారు. బొందిలిపాలెం ఎస్సీ కాలనీలోని ఆమెన్ మందిరంలో పాస్టర్ జంగాల బుజ్జిబాబు ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలతో గ్రామపురవీధులలో తిరుగుతూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్‌లు కస్తూరి, రాక్‌ప్రశాంత్, నిశ్కాంత్, నర్సమ్మ, సోమేపల్లి వెంకటేశ్వర్లు, పి.కోటేశ్వరరావు, సి.సత్యనారాయణ, గంధం వెంకటేశ్వర్లు, రాయనూతల ఆదాం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో పూలలొద్ది ప్రసన్నాంజనేయస్వామి

చెంఘీజ్‌ఖాన్‌పేట (యడ్లపాడు), మార్చి 24: యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామ పరిధిలోని పూలలొద్ది ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం 40వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా స్వామివారికి తెల్లవారుఝామునుంచే అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నాగవల్లీ దళాలతో అర్చనచేసి ప్రత్యేక అలంకరణ చేశారు. సొలస, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాలవారే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. వైసీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఏర్పాటుచేసిన ప్రసాద వితరణను ప్రారంభించారు.

ఐక్యతకు నిదర్శనం రంజాన్ పర్వదినం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 24: రంజాన్ పర్వదినం సందర్భంగా ఇఫ్తార్ విందులు ఐక్యత, సామరస్యానికి నిదర్శనమని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఇస్లాం కోరుకునేది కూడా విశ్వమానవశాంతి సమసమాజం అని, అదే స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలోని కేబీ రోడ్డు అమీమియా మసీదులో షేక్ నాగూర్, 19వ వార్డులోని జనసేన నాయకులు సుభానీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ప్రత్తిపాటి, జనసేన నాయకులు తోట రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు. ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జనసేనలో పలువురి చేరిక

చిలకలూరిపేట అర్బన్, మార్చి 24: పట్టణానికి చెందిన షేక్ కరిముల్లా మరో వంద మంది కార్యకర్తలతో కలసి ఆదివారం జనసేన పార్టీలో చేరారు. పట్టణంలోని మెడికల్ హాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ సమన్వయ కర్త తోట రాజా రమేష్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంటేశ్వరరావు సమక్షంలో వారంతా పార్టీ కండువా కప్పుకొని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక ఎన్‌డీఏ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు గెలుపునకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మునీర్ హసన్, జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ సుభానీ, లీలా కిషోర్, మండల అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌బాషా, కూరపాటి శివ శంకర్, వీర మహిళలు పెద్దింటి సుమలత, లక్ష్మీ ప్రసన్న, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగ్గాపురంలో బాబు ష్యూరిటీపై ప్రచారం

జగ్గాపురం (యడ్లపాడు), మార్చి 24: మండలంలోని జగ్గాపురం గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు శనివారం రాత్రి నిర్వహించారు. గ్రామంలోని 104వ బూత్ పరిధిలోని బీసీ కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొని సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు పోపూరి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నాదెండ్ల: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అమలు జరపనున్న సూపర్ - 6 పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందని మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గణపవరం, సాతులూరు గ్రామాల్లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో సూపర్ - 6 పథకాల పె ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బండారుపల్లి సత్యనారాయణ, నాయకులు పెంటేలా శేషయ్య మాలెంపాటి లక్ష్మీనారాయణ, కే అచ్చయ్య, కృష్ణారావు, జంపని వసంతరరావు, కమ్మా శ్రీనివాసరావు, కొండయ్య, జనసేన నేత సుభానీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

వినుకొండ, మార్చి 24: వినుకొండ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆట్లూరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో నాగులపాటి శ్రీనివాసరావుతోపాటు పలువురికి ఈ సందర్భంగా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ నాగుర్‌బాషా, షేక్ బాజి, కాలేషా, సుదాకర రెడ్డి, అజయ్‌ప్రకాశ్, సుభాని తదితరులు పాల్గొన్నారు.